VISALAANDHRA, VIJAYAWADA-4, Phone 37.

* * * Regd No. H- 203

విశాలాంధ్ర

701926

File Copy
pt of Info
Public Relations, Hyd A. P.

సంపుటి 14 సంచిక 200] విజయవాడ • 5-10-1964 సోమవారం [4 పేజీలు 7 పై.

'విశాలాంధ్ర'
చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	28 00	30 00
ఆరు మాసాలు	14 00	15 00
మూడు మాసాలు	7 00	7 75
ఒక మాసం	2 40	2.60

ప్రభుత్వ ధరల నిర్ణయానికి బాహాటంగా రాజమండ్రి పట్టణ మిల్లర్ల ధిక్కారం

నిర్ణీత ధరకు బియ్యం సప్లయి చేయడానికి నిరాకరణ

అవినీతి నిర్మూలనపై అనధికార తీర్మానం

లోక్‌సభలో ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబరు 3

ప్రభుత్వ శాఖలలోను, ప్రజా జీవితంలోను అవినీతి నిర్మూలించే విషయమై నేడు లోక్‌సభలో ఒక అనధికార తీర్మానం ఆమోదింపబడింది.

ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ సభ్యుడు శ్రీ సేఠ్ అచల్‌సింగ్ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. తర్వాతనంతరం ఈ తీర్మానాన్ని ఉపసంహరించుకోడానికి స్పీకరు యిచ్చిన అనుమతిని ప్రతిపక్ష సభ్యులు ఆక్షేపించి, తీర్మానంపై వోటింగు జరగాలని పట్టుబట్టారు. దానిపై హోంశాఖ ఉపమంత్రి శ్రీ హాథీ సూచనపై సభవారు తీర్మానాన్ని ఆమోదించారు.

తీర్మానాన్ని ప్రవేశపెడుతూ సేఠ్ అచల్ సింగ్ చట్టాలద్వారా అవినీతి, లంచగొండి తనం నిర్మూలన కావని అన్నారు. సాంఘిక జీవనంలో ఉన్నత పదంలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు తదితరులు ఉన్నత నైతిక ప్రమాణాలను నిలబెట్టడం ద్వారా సమాజంలో ఆదర్శాలను నెలకొల్పగలమని అన్నారు.

జనసంఘ సభ్యుడు శ్రీ ఓంకార్‌లాల్ మాట్లాడుతూ తమ పదవులను ఉపయోగించుకొని డబ్బు సంపాదించే "అవినీతి పరులైన మంత్రులున్నంత వరకు పరిస్థితులు బాగుపడవని అన్నారు.

శ్రీమతి రేణుకారే (కాం. పశ్చిమ బెంగాల్) మంత్రులు, పార్లమెంటు సభ్యుల ప్రవర్తన పట్ల ఆరోపణలకు తావులేనిదిగా ఉండాలన్నారు.

శ్రీ రామ సేవక్ యాదవ్ (ఎస్ ఎస్ పి.-యు పి.) సమాజంలో ఆర్థిక హెచ్చు తగ్గులే ఈ అవినీతికి కారణమన్నారు. కొంతమంది మంత్రులు వ్యాపార వర్గాలకు అతి సన్నిహితంగా ఉంటున్నారనీ రాజకీయ పార్టీలకు కంపెనీలు విరాళాలిచ్చే పద్ధతులను విడనాడాలనీ అన్నారు.

మరికొందరు సభ్యులు మాట్లాడిన తరువాత హోంశాఖ ఉపమంత్రి శ్రీ హాథీ మాట్లాడుతూ అవినీతి నిరోధానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలలో జాప్యం వలననే ఎక్కువ అవినీతి, లంచగొండి తనాలకు కారణమనీ, ఇటువంటి జాప్యాలను నివారించటానికి అన్ని శాఖలలోను కమిటీలను నియమించామనీ, అవినీతి గురించివచ్చే ఫిర్యాదులను విచారించటానికి కొన్నిశాఖలలో ప్రత్యేక కమిటీలను నియమించామనీ అన్నారు.

కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక కమిషన్‌ను నియమించిందనీ, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తనిఖీ కమిటీలను నియమించాయనీ అన్నారు.

క్వింటాల్ రు 74 కి తక్కువకు అమ్మము అని మొండిపట్టు

రాజమండ్రి, అక్టోబరు 3

సెప్టెంబరు 15 తేదీ నుండి అక్టోబరు 1 వ తేదీ నాటికి రాజమండ్రి మార్కెట్ ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగాయి.

బస్తా రూ 66 లు అమ్మవలసిన అక్కుళ్లు 76 రూపాయలు పలుకుతోంది. మిల్లర్లు రూ 74 లకు తక్కువకు ఇవ్వనందువల్ల రేట్లు పెరిగాయంటున్నారు. అలాగే కిచిడీ బియ్యం బస్తా రూ 85 వరకూ అమ్ముతున్నారు. పెచ్చు రేటుకి ఎంత పెచ్చు సరుకయినా లభ్యమవుతున్నది. తక్కువ రేటుకు సరుకు దొరకడం లేదు. వర్తకులు తమవద్ద స్టాకులేవని చెవుతున్నారు. ఏనోట చూచినా ఈ ప్రభుత్వానికి శాపనార్థాలు వినబడుతున్నాయి.

దీనికితోడు వివిధ రకాల పప్పు ధాన్యాలు బెజవాడ మార్కెట్‌కి పోతున్నాయని తెలుస్తూంది. పేరుకనగ తెలంగాణా హైద్రాబాదు ప్రాంతాలకు విరివిగా ఎగుమతి కాబడుతోంది.

సెప్టెంబరు రెండవ అర్ధ భాగంలో రాజమండ్రి మార్కెట్‌లో (టాక్సు లేకుండా) ఈ క్రింది విధంగా ధరలు పెరిగాయి

బియ్యం అక్కుళ్ళు బస్తా 100 కి. లో			రు. 76-00
కిచిడి			86-00
		సెప్టెంబరు 15నాటికి ధరలు -	అక్టోబరు 1వ తేదీకి ధరలు
కందులు	100 కిలో	రు. 88/-	రు. 95/-
కందులు మహోరకం			రు. 90/-
మినుములు	..	రు. 66/-	.. 72/-
పచ్చపెసలు	..	86/-	.. 90/-
శనగలు	..	80/-	.. 100/-
కందిపప్పు	82 కిలోలు	రు. 95/-	.. 108/
పెసరపప్పు	..	95/-	
	రకాల వారిగా	రు. 101/- నుండి 115 వరకూ వుంది.	
శనగపప్పు	82 కిలో	రు. 95/-	రు. 100/-
ఉలవలు	100 కిలో	రు. 50/-	రు. 61/-
జొన్నలు	..	రు. 50/-	రు. 65/-
గంటెలు	80 కిలో	రు. 25/-	రు. 36/-
ధనియాలు	40 కిలో	రు. 95/-	
	ధనియాలు	రూ 110/- నుండి 120/- వరకు.	

ఏలూరులో వరద దృశ్యాలు

తమ్మిలేరు పొంగి ట్రంక్ రోడ్డుమీదుగా ఏలూరికాలువలో పడుతున్న దృశ్యం



వరదనీటిలో మునిగివున్న కార్మికభీమా ఆసుపత్రి

కేరళలో కాంగ్రెస్ సముద్ధరణ సమితి అవతరణ

కొట్టాయమ్ అక్టోబరు 3

"కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ సముద్ధరణ సమితి" పేరుతో రాష్ట్రంలోని అన్ని స్థాయిలలోని కాంగ్రెస్ సంస్థలను ఏర్పాటు చేయటానికి కేరళ తిరుగుబాటు కాంగ్రెసువాదులు నిర్ణయించారు.

నిన్న ఇక్కడ జరిగిన సమావేశంలో ఈ కాంగ్రెసు సముద్ధరణ సమితికి శ్రీ కె. ఎం. జార్జిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

కొట్టాయమ్‌లో అక్టోబరు 8 న సమితి మొదటి సదస్సు జరపటానికి నిన్న సమావేశంలో నిర్ణయం తీసుకోబడింది.

భారత - చైనా సంబంధాల విషయమై కైరోలో చర్చ

ప్రధాని శాస్త్రి - అధ్యక్షుడు నాజర్‌ల మధ్య

కైరో, అక్టోబరు 3

భారత ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి నిన్న యిక్కడకు వచ్చినప్పటినుండి ఐక్య అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు శ్రీ నాజర్‌తో ప్రారంభించిన సంభాషణలలో భారత - చైనా సంబంధాల గురించే ప్రధానంగా చర్చజరిగిందని అధికార వర్గాలద్వారా తెలుస్తూంది.

భారత-చైనా సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత దేశం అంగీకరించిన కొలంబో ప్రతిపాదనల గురించి ఐక్య అరబ్ రిపబ్లిక్ వైఖరిలోఎట్టిమార్పురాలేదు. ఇటీవల చైనాతో ఈవిషయమై ఐక్య అరబ్ రిపబ్లిక్ ఎటువంటి సంభాషణలు జరపలేదుకూడా.

గత రాత్రి శ్రీ శాస్త్రీ, నాజర్ 90 నిముషాల సేపు జరిపిన సంభాషణలు మళ్ళీ నేటి ఉదయం ఒక గంట సేపు కొనసాగాయి.

వివిధ రాజ్యాధిపతుల ఆగమనం

కైరో అక్టోబరు 3

ఎల్లుండి నుండి ఇక్కడ ప్రారంభం కానున్న అలీన రాజ్యాల సభలో పాల్గొనే టందుకు యింతవరకు భారత, సింహళ ప్రధానులు, యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో, క్యూబా అధ్యక్షుడు అస్వాల్డ్ డార్టికోస్ వచ్చారు.

ఇండొనీషియా అధ్యక్షుడు డాక్టర్ సుకర్నో, అల్జీరియా అధ్యక్షుడు బెన్‌బెల్లా, లావోస్ ప్రధాని సౌవన్నఫౌమా ఈరోజే యిక్కడకు చేరనున్నారు.

ఉపసంఘాల పని ప్రారంభం

మహాసభకు సన్నాహాలు జరుపుతున్న వివిధ దేశాల విదేశాంగ మంత్రులు ఎజెండాపై తొలిచర్చల అనంతరం. రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక వ్యవహారాలను చర్చించి ముసాయిదా తీర్మానాలను తయారు చేసేటందుకు మూడు ఉప సంఘాలుగా ఏర్పడ్డారు.

వివిధ రాజ్యాల, ప్రభుత్వాల అధిపతుల మహాసభ సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమౌతుంది. అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ స్వాగత ప్రసంగం చేస్తారు.

కొత్త ప్రధాని ఎన్నిక సమయంలో :

రు. 3 కోట్లు క్రుమ్మరించడానికి పెట్టుబడిదారులు చేసిన యత్నం

రాజ్యసభ చర్చలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ భూపేష్‌గుప్త వెల్లడి

న్యూఢిల్లీ అక్టోబరు 3

నెహ్రూ మరణానంతరం పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ కొత్త నాయకుని ఎన్నికను తమకు అనుకూలంగా జరిపించుకోడానికి కొంతమంది పెట్టుబడిదారులు రు. 3 కోట్లు క్రుమ్మరించారని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ భూపేష్ గుప్త నేడు రాజ్యసభలో బైట పెట్టారు.

రాజకీయ పార్టీలకు కంపెనీలు విరాళాలివ్వకుండా నిషేధించాలని జనసంఘ సభ్యుడు శ్రీ వాజ్‌పేయి తెచ్చిన బిల్లుపై చర్చలో శ్రీ భూపేష్ గుప్త పై విషయం వెల్లడించారు.

అంతట కాంగ్రెస్ సభ్యుడు శ్రీ అరిదారీ లేచి ఈ విషయాన్ని రుజువు చేయవలసిందనీ ఆ పెట్టుబడి దారుల పేర్లు ఏమో చెప్పవలసిందనీ సవాలు చేశారు.

శ్రీ భూపేష్ గుప్త తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ టాటా కంపెనీలకు ప్రభుత్వం ఇచ్చిన రుణాలను అందుపై వడ్డీలను వసూలు చేయకపోవడానికి కారణం ఆ కంపెనీ కాంగ్రెసుకు యిస్తున్న ఎన్నికలనిధి కారణమన్నారు.

కంపెనీల నుండి కమ్యూనిస్టుపార్టీ విరాళాలు స్వీకరించదనీ కంపెనీల జమా ఖర్చుల పట్టికలనుండి ఈ విషయం నిర్ధారణ చేసుకోవచ్చునని అన్నారు

శ్రీ అరిదారీ : మీరు దొంగదారులగా తీసుకోవచ్చుగదా ?

శ్రీ భూపేష్‌గుప్త : దొంగడబ్బు తీసుకునే వారిని ఉరితీయండి.

శ్రీ జోసెఫ్ మాథెన్: కమ్యూనిస్టు పార్టీ చైనా బ్యాంక్ నుండి రు 30 లక్షలు తీసుకుంది.

శ్రీ భూపేష్‌గుప్త : చైనా బ్యాంక్ వ్యవహారాలన్నీ విచారణలో ఉన్నాయి విచారణ కర్తలకు మీరు ఈ విషయాన్ని ఎందుకు చెప్పకూడదు ?

యితర ప్రతిపక్ష సభ్యులు తమ ప్రసంగాలలో కాంగ్రెస్‌పై రోజురోజుకు గుత్తపెట్టుబడిదారుల వ్యాపారస్తుల ప్రాబల్యం ఏవిధంగా పెరుగుతున్నదీ కాంగ్రెసును ఏ విధంగా అవినీతి పాల్జేస్తున్నదీ, ఏ విధంగా ప్రజా ప్రాముఖ్యాన్ని సోషలిజాన్ని అడుగంట చేస్తున్నదీ వివరించారు. పెద్దపెద్ద పారిశ్రామిక యజమానులు కాంగ్రెస్ ఎన్నికల నిధికి భారీ మొత్తున విరాళాలిచ్చి ప్రభుత్వాన్ని తమ చేతుల్లో ఉంచుకోడానికి దీనిని వినియోగించుకుంటున్నారని అన్నారు. అందుచేత రాజకీయపార్టీలకు కంపెనీలు విరాళాలు ఇవ్వకుండా నిషేధించాలని అన్నారు.

ఈ చర్చ పూర్తి కాకుండానే సభ కాల నిర్ణయం లేకుండా వాయిదా పడింది.

వినుకొండలో బియ్యం కరువు

వినుకొండ అక్టోబరు 3

గుంటూరు జిల్లా వినుకొండకు గత రెండు రోజులనుండి బియ్యం స్టాకు లేదు బ్లాక్ మార్కెట్‌లోరూపాయకు ఏడుగిద్దలు చొప్పున అమ్మారు. ఇటీవల ఒక లారీ బియ్యం స్టాకు వచ్చినవి. కాని యీ బియ్యం తినుటకే మాత్రం యోగ్యంగా లేవు. ఎర్ర ముద్ది చెక్కలుగా, నాసిగా వున్నాయి. బియ్యం తిరిగి దంపుకుంటే నూకలవుతవి.

3000 మంది ఇండోర్ విద్యార్థుల సమ్మె

ఆయుర్వేద కళాశాలను యూనివర్శిటీకి అనుబంధించాలని డిమాండు

ఇండోర్ అక్టోబరు 3

ఇండోర్ విశ్వవిద్యాలయానికి స్థానిక ఆయుర్వేద కళాశాలను అనుబంధించటానికి నిరాకరించినందుకు నిరసనగా నేడు ఇక్కడ అన్ని వైద్య మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 3000 మంది విద్యార్థులు నిరసనసమ్మె చేశారు.

ఆయుర్వేద కళాశాలను ఇండోర్ విశ్వవిద్యాలయానికి అనుబంధించాలని నినాదాలిస్తూ విద్యార్థులు నేడు విశ్వవిద్యాలయ భవనం ఎదుట ప్రదర్శనలు జరిపారు. ఉక్కు శిరస్త్రాణాలు ధరించి పోలీసులు యూనివర్శిటీ భవనాన్ని ఉదయం నుండి కావలా కాస్తున్నారు.

సమ్మె చేయవలసినదిగా విద్యార్థులు ఎన్నుకొన్న ఐక్యకార్యాచరణ సమితిపిలుపుఇచ్చింది

ఈ ఆయుర్వేద కళాశాలకు యూనివర్శిటీకి అనుబంధం నిరాకరిస్తూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ చేసిన ఏకగ్రీవ తీర్మానం తుది నిర్ణయంకాదని ఇటీవల ఏర్పడిన పరిస్థితులదృష్ట్యా కౌన్సిల్ ఈనెల మధ్యలో సమావేశమై సమస్య పునఃపరిశీలన కావించగలదని విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు శ్రీ హెచ్ యస్. కామత్ నేడు పత్రికా ప్రకటన గావించారు.

విద్యార్థులు ప్రదర్శనకు ముందు నగర ప్రధాన వీధులలో ఊరేగింపు జరిపారు. ప్రదర్శనానంతరం విద్యార్థుల ప్రతినిధివర్గం యూనివర్శిటీ వైస్-ఛాన్సలర్‌ను, రిజిస్ట్రార్‌ను కల్సుకున్నారు అనంతరం విద్యార్థి ప్రతినిధులు పత్రికా ప్రకటన చేస్తూ సమస్యను చర్చింటానికి వైస్ ఛాన్సలర్ నిరాకరించారని, సమస్యా పరిష్కారానికి యూనివర్శిటీ అధికారుల వైఖరి సుముఖంగా లేదని త్వరలో ఈ సమస్యను పరిష్కరించకపోయినచో, ఇంతకన్నా పెద్దఎత్తున సమ్మె చేయవలసి వుంటుందని తెలియజేశారు. యూనివర్శిటీ భవనముందు దళాలవారీగా నిరాహారదీక్షను సాగించగలమని కూడా వారు చెప్పారు.

ఆయుర్వేద కళాశాలకు చెందిన 6 గురు విద్యార్థులు నిన్నటినుండి విశ్వవిద్యాలయ భవనం వెలుపల నిరాహారదీక్ష సాగిస్తున్నారు.

గత నెలకంటె అదనంగా గోధుమలు, బియ్యం

తరుగు రాష్ట్రాలకు కేంద్రం సప్లయిచేస్తుందని లోక్‌సభలో శ్రీ సుబ్రహ్మణ్యం ప్రకటన

న్యూఢిల్లీ అక్టోబరు 3

గత నెలకంటె నూటికి 20 నుండి 25 వంతులు ఎక్కువగ గోధుమలు సాధ్యమైనంత ఎక్కువగ ధాన్యం ఈ నెలలో కేంద్ర గోదాములనుండి రాష్ట్రాలకు సప్లయి చేయబడతాయని ఈరోజు లోక్‌సభలో దేశఆహార పరిస్థితిపై మాట్లాడుతూ ఆహారశాఖామంత్రి శ్రీ సి సుబ్రహ్మణ్యం ప్రకటించారు.

ఈ సంవత్సరం ఖరీఫ్ పంట ప్రోత్సాహకరంగా వున్నట్లు వార్త లందాయని, ధాన్యం పంట క్రితం సంవత్సరంవలె వుంటుందని జొన్న సజ్జల పంట బాగానే వుంటుందని వీరు తెలియజేశారు.

6 లక్షల 60 వేల టన్నుల గోధుమల్ని కేంద్రం రాష్ట్రాలకు ఈ నెలలో సరఫరాచేస్తుందని చెప్పారు ఇది సెప్టెంబరు నెలలో ఇచ్చిన దానికంటె 50 వేల టన్నులు అధికమని చెప్పారు.

గత నెలలోకంటె ఈ నెలలో గోధుమలు ఎక్కువగా దిగుమతి అవుతాయని అన్నారు. సెప్టెంబరులో అమెరికన్ రేవులో సమ్మెవల్ల బొంబాయిలో అధిక వరాలవల్ల గోధుమల దిగుమతి తక్కువగా జరిగిందని వివరించారు

ఈ సంవత్సరం ఆఖరికి 6 కోట్ల టన్నుల గోధుమల్ని కేంద్రం సప్లయిచేసుందని ఆహార శాఖ యింత ఎక్కువగా ఎప్పుడూ రాష్ట్రాలకు సప్లయి చేయలేదని తెలియజేశారు.

ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకొనే గోధుమలు ధాన్యం కలిసి తరుగు రాష్ట్రాలకు సాధ్యమైనంతవరకు వాటి అవసరాలు తీరే విధంగా సప్లయి చేయగలుగుతామని భావిస్తున్నట్లు వారు చెప్పారు.

కాని వచ్చే రెండు లేక మూడు నెలలు కొంత గడ్డుగానే వుంటుందని అన్నారు. ఇపుడు కేంద్రం తనవద్ద నున్న నిలవనుండి తరుగు రాష్ట్రాల అవసరాలకు సరిపడేఆహారధాన్యాల్ని వాటికిపంపించడానికి ప్రయత్నిస్తుందనిచెప్పారు.

ఆహార ధాన్యాల దిగుమతుల వివరాల గురించి మాట్లాడుతూ, గత బుధవారంనాడు అమెరికాతో చేసుకున్న పి. యల్ 480 ఒప్పందం ప్రకారం, 40 లక్షల టన్నుల గోధుమలుగాక, 3 లక్షల టన్నుల బియ్యం అమెరికానుండి 1965 జూన్‌నెల ఆఖరికి దిగుమతి అవుతాయని తెలియజేశారు.

పాకిస్తాన్ నుండి 71 వేల టన్నులబియ్యం దిగుమతి అయ్యాయని థాయిలాండ్ నుండి 10 వేల టన్నుల బియ్యం దిగుమతి అవుతాయని మరి 10 వేల టన్నుల బియ్యం కాంబోడియా నుండి దిగుమతి అవుతాయని చెప్పారు.

ఒక లక్ష 50 వేల టన్నుల బియ్యాన్ని బర్మా నుండి దిగుమతి చేసుకొనేందుకు బర్మా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవటం జరిగిందని తెలియజేశారు.

దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గురించి శ్రీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్రితం సంవత్సరం కంటే ఈ సంవత్సరం పంజాబ్, మధ్యప్రదేశ్ లలో బియ్యంపంట బాగా వుందని, పశ్చిమ బెంగాల్ ఒరిస్సా, మద్రాసు, మైసూర్ రాష్ట్రాలలో క్రితం సంవత్సరంవలె వుందని అన్నారు

బీహార్‌లోను, ఉత్తర ప్రదేశ్ కొన్ని భాగాలలోను, వరదవల్ల మొదటిపంటకి కొంత నష్టం కలిగినప్పటికీ తరువాత రెండవ ధాన్యం పంటబాగా బాగా వుందని మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాల్లో జొన్నల పంట, రాజస్థాన్‌లో జొన్న సజ్జలపంట బాగా వుందని తెలియజేశారు.

వరదలవల్ల, బీహారులోను, ఉత్తర ప్రదేశ్‌లో కొన్నిభాగాలలోను మొక్కజొన్నల పంటకు కొంతదెబ్బ తగిలిందని లోక్‌సభలో ఆహారమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం వివరించారు.

ఈ వివరాలను తెలియజేస్తూ నాలుపేజీల ప్రకటనను లోక్‌సభకు వీరు సమర్పించారు.

డిసెంబరు 6 నుండి దేశవ్యాపిత ఆందోళన

రిపబ్లికన్ పార్టీ నిర్ణయం

న్యూఢిల్లీ అక్టోబరు 3

అహింసా పద్ధతుల్లో తమ కోర్కెల సాధనకు డిసెంబరు 6 నుండి దేశవ్యాపిత ఆందోళన సాగించటానికి భారత రిపబ్లికన్ పార్టీ నిశ్చయించినట్లు ఇక్కడ నేడొక ప్రకటన వెలువడింది దున్నేవారికి భూమి పంచాలని, వ్యవసాయదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని కూడా రిపబ్లికన్‌పార్టీ కోర్కెలలో ఉన్నాయి

అక్టోబరు 1న పార్లమెంటు భవనం ఎదుట ప్రదర్శన జరిపి, ప్రభుత్వానికి కోర్కెల పత్రాన్ని అందజేసినప్పటికి ఆ ప్రదర్శనపట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందనే అభిప్రాయంతో నే డిక్కడ రిపబ్లికన్‌పార్టీ కార్యవర్గం ఈ నిర్ణయాన్ని తీసుకొన్నది.

ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించేందుకని 7 గురు సభ్యులతో ఒక కార్యాచరణ కమిటీ ఎన్నుకోబడింది రాజ్యసభ సభ్యులు శ్రీ బి కె. గయక్వాడ్ ఈ కమిటీకి నాయకత్వం వహిస్తారు

శ్రీ గయక్వాడ్‌ను పార్టీ అధ్యక్షులుగా కార్యవర్గం ఎన్నుకొన్నది. ఇంతకు ముందు శ్రీ శివరాజ్ అధ్యక్షులుగా వుండేవారు. ఆయన మరణించినందు వల్ల శ్రీ గాయక్వాడ్‌ను ఎన్నుకోవడం జరిగింది.

శ్రీ శివరాజ్ మరణానికి తీవ్ర సంతాపాన్ని తెల్పుతూ కార్యవర్గం తీర్మానంచేసింది.

కార్యాచరణ కమిటీలో పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. డి ఖోబరగాడే శ్రీ బి. పి. మౌర్య (యం పి) లు కూడా ఉన్నారు.

ఈ కమిటీ దేశ వ్యాపిత ఆందోళనను విజయవంతంగా నిర్వహించేందుకు కార్యక్రమాన్ని వివరంగా రూపొందిస్తుంది ఢిల్లీ ప్రదేశ్ కార్యవర్గ కమిటీని రద్దుపరుస్తూ ఈ కార్యవర్గ సమావేశం తీర్మానించింది.

ఏలూరు టీచర్ల, ఉద్యోగుల జీతాల నిరాకరణ సమ్మె

ఏలూరు, అక్టోబరు 1

ఏలూరులోని ఎన్ జి వో లు, ఉపాధ్యాయులు జీతాల నిరాకరణ దినం సందర్భంగా నేడు నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలలకు, ఆఫీసులకు వెళ్ళారు తమ్మిలేరు వరద మూలంగా స్టేట్‌బ్యాంకు కార్యకలాపాలు సాగకపోవడంతో జీతాలు 1వ తేదీనఎవ్వరికి చెల్లించే అవకాశం కూడా లేకుండా పోయింది.

సాయంత్రం ఎన్. జి. వో హాలులో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త సమావేశం శ్రీ సోరి రామశర్మగారి అధ్యక్షతను జరిగింది. (వి వి

ప్రజాందోళన అణచివేయడానికి రక్షణ నిబంధనల వినియోగం

పార్లమెంటులో ప్రతిపక్షసభ్యుల విమర్శ

న్యూఢిల్లీ అక్టోబరు 3

ప్రతిపక్షాల నాయకులను అరెస్టు చేయడానికి. నిర్బంధంలో వుంచడానికి దేశరక్షణ చట్టాన్ని ఉపయోగిస్తున్నారని పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు

పాలకపార్టీని బలపరచుకునేందుకు, అధిక ధరలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాందోళనను అణచివేసేందుకు దేశరక్షణ చట్టాన్ని ఉపయోగిస్తున్నారన్న ప్రతిపక్షాలవిమర్శను లోక్‌సభలో నేడు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి శ్రీ జె. యల్ హాథీ తిరస్కరించారు. శాంతియుత ప్రదర్శనలకు వ్యతిరేకంగా దేశరక్షణ చట్టాన్ని ఉపయోగించకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రులందరికీ కేంద్ర హోంమంత్రి ప్రత్యేక వర్తమానం పంపారని ఆయన చెప్పారు. ఉత్పత్తి యంత్రాంగాన్ని నిర్వీర్యం కావించేప్పుడు, దౌర్జన్య చర్యలకు ప్రదర్శకులు తలపడినప్పుడు, రవాణా సౌకర్యాలకు భంగం కలిగెట్టబడినప్పుడు మాత్రమే దేశరక్షణ చట్ట నిబంధనలను అమలు పరచటం జరిగిందని ఆయన అన్నారు.

కమ్యూనిస్టు నాయకుడు శ్రీ బిరేన్‌దత్ దీర్ఘకాలంగా అత్యవసర పరిస్థితిని రద్దు పరచకుండా వున్నారని, కనుక దేశరక్షణ చట్టాన్ని రాజకీయ, కార్మిక నాయకులను నిర్బంధంలోనికి తీసుకునేందుకు, ప్రజాందోళనను అణచివేసేందుకు, అధికధరలకు నిరసనగా ఉధృతంగా సాగిన ప్రజోద్యమాన్ని అణగద్రొక్కేందుకు ఉపయోగించరాదని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానం 93-20 ఓట్లతో వీగిపోయింది.

తీర్మానానికి సమాధానమిస్తూ శ్రీ జె.యల్. హాథీ 1962 ఆగస్టు మాసాంతానికి డి ఐ ఆర్ క్రింద 3006 మందిని డిటెన్యూలుగా తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం డిటెన్యూలుగా వున్నవారు 961 మందేనని, అందులో 81 మంది మాత్రమే కమ్యూనిస్టులని అన్నారు.

పైగా అతివాద కమ్యూనిస్టులు తమ సభలో చైనా నాయకుల ఫోటోలను పెట్టినందుకు వారిపై కఠిన చర్యలను తీసుకోనందుకు దేశంలోని అత్యధిక సంఖ్యాక ప్రజలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆయన అన్నారు.

దేశంలోనూ, వెలుపలా దేశ ద్రోహ ప్రకటనలను బహిరంగంగా కొంతమంది చేస్తున్నప్పటికి వారిపై ప్రభుత్వం ఎట్టి చర్యలను గైకొనలేదని ప్రజాందోళనను అణచివేసేందుకు మాత్రం దేశరక్షణ చట్టాన్ని ఉపయోగిస్తున్నారని జనసంఘ సభ్యులు శ్రీ ఓంకార్‌లాల్ బెర్వా అన్నారు.

రాజ్యసభలో చర్చ

రాజకీయ కారణాలపై వ్యక్తులను అరెస్టు చేయటం, డిటెన్యూలుగా నిర్బంధించటం ద్వారా ప్రభుత్వం దేశరక్షణ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నదని నేడు రాజ్యసభలో కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్‌గుప్తా సంయుక్త సోషలిస్టుపార్టీ సభ్యులు ప్రొఫెసర్ ముకుట్ బిహారీలు తీవ్రంగా విమర్శించారు.

తమ పార్టీ ప్రధాన కార్యదర్శిని నిర్బంధంలో వుంచారని కాశ్మీర్‌లో మైనారిటీ గ్రూపును అణచివేసేందుకు కాశ్మీర్ ప్రభుత్వం బక్షీ గులామ్ మహమ్మద్‌ను అరెస్టుచేసిందని శ్రీ ముకుట్ బిహారీ అన్నారు.

2 సంవత్సరాలనుండి ఎట్టి విచారణ జరపకుండా, ఉత్తర ప్రదేశ్ మహారాష్ట్రాలలో ఎందుకు 15 మంది కమ్యూనిస్టులను నిర్బంధంలో వుంచారని శ్రీ భూపేష్‌గుప్తా ప్రశ్నించారు.

దేశ రక్షణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విచక్షణారహితంగా ప్రయోగించాయనే విమర్శను హోంశాఖ ఉపమంత్రి శ్రీ యస్.యన్ మిశ్రా నిరాకరించారు.

శ్రీ గంగా శరణ్ సిన్హాకు సమాధానమిస్తూ ఇటీవల బీహార్‌లో జరిగిన కాల్పులపై వివరాలను సేకరించి పంపవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, ఆ కాల్పులలో ఇద్దరు మరణించారని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శ్రీ బి. ఆర్. భగత్ తెల్పారు.

బీహార్‌లో వరదల తగ్గుముఖం

పాట్నా, అక్టోబరు 4

బీహార్ రాష్ట్రంలో వరదలు తగ్గుముఖం పట్టినట్లు అధికార వార్తలు వెలువడ్డాయి

సెప్టెంబరు మాసంలో రెండుమార్లు వరదలకు గురైన శరణ్‌జిల్లాలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి

ఈ వరదలవల్ల ఈ జిల్లాలో 300 చదరపు మైళ్ళ వైశాల్యంలోని, 633 గ్రామాలు, తీవ్ర నష్టాలకు గురైనాయి. ఈ గ్రామాలలో నివసిస్తున్న జనాభామొత్తం 3 25, 610, వరదలవల్ల నష్టపడిన ప్రజలందరికీ సహాయ కార్యక్రమాల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేయబడుతున్నాయని అధికారప్రకటన వెలువడింది. ఈ వరదలవల్ల చంపారన్ జిల్లాలో 7788 గృహాలు కూలిపోయాయి

నెహ్రూ జీవితంపై చలనచిత్ర నిర్మాణం

ప్రభుత్వ ఆలోచనలో ఉన్నదని వెల్లడి

న్యూఢిల్లీ అక్టోబరు 4

పండిత జవహర్లాల్ జీవిత చరిత్రను గురించి ఒక చలన చిత్రాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని. రేడియో సమాచార శాఖ మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ నేడు తన శాఖకు చెందిన పార్లమెంటరీ సమాలోచనా సంఘానికి తెలియజేశారు. ఈ చిత్ర నిర్మాణం విషయమై ఒక ప్రసిద్ధ నిర్మాతతో సంప్రతింపు కూడా జరిగిందని ఆమె తెలిపారు.

చాలశక్తివంతమయిన రేడియో ప్రసారక యంత్రం గురించి ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ నెల పదవతేదీ నాటికి ప్రకటించడం జరగవచ్చునని ఆమె తెలిపారు.

మేలయిన డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాణం చాల అవసరమని ఈ సమావేశంలో సభ్యులు తెలిపారు. సెన్సార్‌షిప్ నిబంధనలను గురించి కూడా చర్చించారు.

వరంగల్ సత్యాగ్రహుల జైలు శిక్షలు

వరంగల్ అక్టోబరు 1

ఆగస్టు 25 తేదీన ఆహార సమస్యపై వరంగల్‌లో సత్యాగ్రహం చేసిన 3 మందికి 28 వ తేదీన సత్యాగ్రహం జరిపిన 6 గురికి మొత్తం 13 మందికి నెల రోజుల శిక్ష విధింపబడినది. 25 తేదీన జరిపిన ఎ. టూకారీ, కూరపాటి రాజమౌళి మహ్మద్ మహబూబ్ అలీ, మొర్రి గాద్దులు, కొయిలు, మారెడ్డి ఎల్లయ్య రంగు నర్సయ్య, బండి కొమురయ్య ఎల్లమళ్ళ అబ్బయ్య గార్లకు ఒక్కొక్కరికి ఒక నెల సాధారణ శైదు విధించుతూ ఎడిషనల్ మున్సిఫ్ తీర్పు నిచ్చారు.

ఇదే విధంగా 6 గురు ధర్మసాగరం పేరియా సత్యాగ్రహులకు నెల రోజుల శిక్ష విధింపబడింది.

విశాలాంధ్ర

స్వలాభపరుల సవాలు : ముఖ్యమంత్రి లొంగుబాటు

అన్నం పరబ్రహ్మ స్వరూపం: అన్నగత ప్రాణులు మానవులు, అన్నారు పూర్వీకులు

ఆహారం ప్రాణులన్నిటికీ జీవనాధారమయినది. ఊపిరి పీల్చుకొనే గాలి తరువాత ఆకలిదప్పులనుతీర్చుకోవడం భూచరాలన్నిటికీ నిత్యావసరాలు: అవి లేకుండా ప్రాణికోటి మనలేదు

ఆకలి మహా చెడ్డది. బుద్ధిని దహించివేస్తుంది. అందుచేతనే విశ్వామిత్ర మహర్షిలాంటివాడు సైతం ఆకలిబాధకు తట్టుకోలేక, ఛండాలుని ఇంట్లో కుక్కమాంసాన్ని దొంగిలించాడని మహాభారత ఇతిహాసంలో ఒక గాథ వుంది

పౌరులందరికీ ఆహారం అందేటట్లు చూడటం కనీసధర్మంగా ప్రతి నాగరికప్రభుత్వం ఎంచుతోంది. ఈ దృష్టితోనే ఆహారకొరతనుతట్టుకునేందుకు సుమారు 200 కోట్ల రూపాయల విలువచేసే ఆహార ధాన్యాలను విదేశాలనుండి భారత ప్రభుత్వం దిగుమతి చేసుకుంటోంది. ఆహార ధరలను అదుపులో వుంచడానికి ప్రయత్నించుతోంది. చౌక దుకాణాలను తెరపించి, బీదప్రజలకు అందుబాటులో వుండే ధరలకు అమ్మించుతానని వాగ్దానాలు చేస్తోంది

కాని చౌక దుకాణాలలో బీదలకు ధాన్యం లభ్యం కావడంలేదు. ప్రభుత్వము నిర్ణయించిన ధరలు నాలుగు రోజులైనా నిలబడలేదని కేంద్ర ఆహారమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం స్వయంగా అంగీకరించక తప్పలేదు

ఆహార ధాన్యాల ధరలు చుక్కలంటుతున్నాయి. చీకటి బజారులో అధిక ధరలకు స్వలాభపరులైన వ్యాపారస్తులు నిత్యం ఆహార ధాన్యాలను అమ్ముతున్నారు. దొంగ మార్కెటులో విపరీత ధర చెల్లించగలిగితే ఎంత సరుకైనా దొరుకుతుంది

కాని ప్రభుత్వం స్థాపించిన చౌక దుకాణాల్లోగాని, లైసెన్సు పొందిన చిల్లర వర్తకులవద్దగాని నిర్ణీత ధరలకు మాత్రం పౌరులకు సరుకు దొరకడం లేదు. టోకు వ్యాపారస్తులు తమకు సప్లయి చేయలేదని చిల్లర వర్తకులు, నిర్ణీత ధరలకు తమకు సరుకు దొరకడం లేదని టోకు వ్యాపారస్తులు చెబుతున్నారు. ఆహార సంక్షోభానికంతటికీ ప్రభుత్వ విధానమే కారణమని ఉభయులూనిందించుతున్నారు

దేశంలో పౌరులందరికీ సరిపడిన ఆహార ధాన్యాల నిల్వలు వున్నాయని ప్రభుత్వ మంటూంది. 1962-63 పోలికంటే 1963-64 సంవత్సరంలో ఆహార ధాన్యాలు హెచ్చుగా పండాయనీ, విదేశాలనుండి దిగుమతులు తగినంతగా వచ్చాయనీ మంత్రులు లెక్కలు చూపుతున్నారు.

కాని దేశంలోసరిపడిన ఆహారనిల్వలున్నాయనే వాదనగాని, ప్రభుత్వమిచ్చే లెక్కలుగాని ప్రజల ఆకలి తీర్చవు. ఆ నిల్వలను బయటకు తీయటం, నిర్ణీతధరలకు ప్రజలందరికీ అందించటం ప్రభుత్వ కనీస కర్తవ్యం: ఆ విషయంలో మాత్రం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ఆహార ధాన్యంలో మిగులు రాష్ట్రం. దక్షిణాది కంతటికీ ధాన్యాగారమని ప్రతీతి. కాని ఇచట కూడ నిర్ణీత ధరలకుప్రజలకుఆహార ధాన్యాలు దొరకటంలేదు. ఈసత్యం ప్రభుత్వానికి తెలుసు. ఎచటనైనా తీవ్ర ప్రజాందోళన జరిగితే అపుడు మాత్రం మంత్రివర్యులు మేల్కొని ఇదిగో ప్రభుత్వ గోదాములనుండి సప్లయి చేస్తామని తీయనికబుర్లు చెబుతారు. రాష్ట్ర రాజధానిగావున్న జంటనగరాల్లో సైతం ఆహారసప్లయి నిరంతరాయంగా జరగడంలేదు. ఇక తక్కినపట్టణాల సంగతి వేరే చెప్ప నవసరమేలేదు. స్వార్థపరులైన దొంగవ్యాపారుల దయాదాక్షిణ్యాలకు స్పెక్యులేషన్ జూదానికి ప్రజా పీఠాన్ని ప్రభుత్వం వదలివేసింది. తన బాధ్యతను నెరవేర్చటంలేదు

ప్రభుత్వంచేత ఆ బాధ్యతను గుర్తించేలాగ చేయాలనే లక్ష్యంతోనే సెప్టెంబరు 2, తేదీన దేశవ్యాపిత హర్తాళును ప్రతిపక్షాలు సాగించాయి

గుంటూరు పట్టణంలో అసెంబ్లీ సభ్యులు శ్రీ కనపర్తి నాగయ్యగారి నాయకత్వాన కమ్యూనిస్టు వలంటీర్లు ఆహార దుకాణాలవద్ద నిలబడి ప్రభుత్వమునిర్ణయించినధరలకుబియ్యాన్ని అమ్మించేందుకు కృషి చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర పట్టణ పెద్దల తోడ్పాటుతో సెప్టెంబరునెల 24 తేదీనుంచి 29 తేదీవరకు అలా చేయగలిగారు

ఆ సంగతి గుంటూరుపౌరు లందరికీ తెలుసు. నిర్ణీతధరలకు ధాన్యం దొరికినందుకు ప్రజలంతా సంతోషించారు. కాని స్వార్థపరులైన రైసుమిల్లర్లకు, ఆహార వ్యాపారస్తులకు మాత్రం దొంగవ్యాపారంలో అధికలాభాలు తమకు దక్కలేదనే ఆక్రోశం కలిగింది

సరిగ్గా ఇదేసమయంలోనే బళ్లారి గుంతకల్లు వగైరా చోట్ల ఆహార గిడ్డంగులను అన్నార్తులైన ప్రజలు దోచుకున్నారనీ పోలీసుకాల్పుల్లో కొందరు మరణించారనీ వార్తలను పత్రికలో మనమంతా చదివాం. మాచర్లపురంలో అసెంబ్లీ సభ్యులు శ్రీ పూల సుబ్బయ్యగారి నాయకత్వాన శాంతియుతంగా ఊరేగింపు జరిపి, నిర్ణీత ధరలకు ధాన్యం అమ్మవలసిందిగా కోరినందుకు, అకారణంగా పోలీసులు కాల్పులు జరిపి, కొందరిని గాయపరచారు

ఈ విషయాలన్నిటినీ ఎందుకు పునరుల్లేఖించవలసి వచ్చిందంటే నిర్ణీత ధరలకు ఆహారం ప్రజలకు అందజేయవలసిన బాధ్యత ప్రధానంగా ప్రభుత్వానిది. ఆ కనీస ధర్మాన్ని ప్రభుత్వం నెరవేర్చటం లేదు.

ఆహార ధాన్యాలు నిర్ణీతధరలకు ప్రజలకు అందకపోవడమే బళ్లారి గుంతకల్లు ఘటనలకు మూలకారణం. అలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా చేయాలంటే మాచర్లపురంలోవలె అధికారులు ప్రవర్తించరాదు. స్వార్థపరుల పక్షం వహించి ప్రజలపై హింసాకాండ జరపటం పరిష్కార మార్గం కానేకాదు. గుంటూరు పట్టణంలోవలె అధికారులు ప్రజా ప్రతినిధులతో సహకరించి, నిర్ణీత ధరలకు ధాన్యం అమ్మించాలిని వుంటుంది

గుంటూరులో ప్రజాహితమైన పంథా అమలు జరిగింది. మాచర్లపురంలో ప్రజా వ్యతిరేక పంథా, దొంగవ్యాపారుల అనుకూల పంథా అమలు జరిగింది.

సెప్టెంబరు 28 వ తేదీన మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి గుంటూరు దయచేసినపుడు అచటి వ్యాపారస్తులు తమ ఆక్రోశాన్ని నివేదించుకున్నారు. మున్సిపల్ చైర్మన్, అసెంబ్లీసభ్యులు నాగయ్య తదితర ప్రజాప్రతినిధులు కూడ ముఖ్యమంత్రిని కలుసుకొని, ఆహార పరిస్థితిని వివరించారు.

కాని విచిత్రమేమంటే నాలుగు రోజుల గుంటూరు పౌరులకు నిర్ణీత ధరలకు ఆహారం అందించిన ప్రజాహితపంథా ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారికి నచ్చలేదు. ఆహార వ్యాపారస్తులకు కలిగిన భయాందోళనలను తొలగించడానికి మహా మంత్రివర్యులు పూనుకున్నారు. నిర్ణీత ధరలకు ధాన్యం అమ్మించేందుకు దుకాణాలవద్దకు వాలంటీర్లను పంపవద్దని అసెంబ్లీ సభ్యులు నాగయ్యగారికి సలహాయిచ్చారు. తదనుసారం 30 తేదీనుండి వాలంటీర్లను ఉపసంహరించుతామని నాగయ్యగారొక ప్రకటన చేశారు

"అన్నీ కామే చేస్తాము" అని ముఖ్యమంత్రి వాగ్దానం చేశారట. అసలు ప్రభుత్వాధికారంలో వున్న పెద్దలు తమ బాధ్యత నెరవేర్చితే ప్రస్తుత ఆహారసంక్షోభానికి అస్కారమే వుండేదికాదు. "రౌతు చేతగానివాడైతే గుర్రం ఎగిరెగిరి పడిన" చందంగా ప్రభుత్వాధినేతల అసమర్థత వల్లనే దొంగవ్యాపారం పెచ్చరిల్లుతోంది.

అందుచేత గుంటూరు ఆహార వర్తకుల ఒత్తిడికి తట్టుకోలేక ముఖ్యమంత్రి ప్రజాహిత కార్యక్రమానికి అడ్డుపడ్డారని భావించుతున్నాం. నిర్ణీత ధరలకుఆహారంప్రజలందరికిఅందించే ఏర్పాటులను రాష్ట్రవ్యాపితంగాచేయక పోతే గుంతకల్లు వంటి ఘటనలు మరెన్నోచోట్ల పునరావృతం కాగలవని హెచ్చరించుతున్నాం.

ప్రతిపట్టణంలోనూప్రజాశ్రేయస్సు కోరే పురప్రముఖులతో కూడిన అఖిలపక్ష ఆహార కమిటీలను ఏర్పరచి, నిర్ణీత ధరలకు వ్యాపారస్తులు ధాన్యం అమ్మేలాగ చూసే బాధ్యత ఆకమిటీకి ప్రభుత్వం అప్పగించాలని కోరుతున్నాం. ప్రజల తోడ్పాటుతోనే దొంగమార్కెటును అరికట్టడం సాధ్యమౌతుందని గుర్తుచేస్తున్నాం.

జనసామాన్యం ఉద్యాధక [illegible] కర్తవ్యం ప్రభుత్వంపై వుంది. ఆహార సంక్షోభానికి కారకులయిన దొంగవ్యాపారులు, వారికి మద్దతు ఇస్తున్న రాజకీయ నేతలు ప్రభుత్వాన్ని సవాలు చేస్తున్నారు. ప్రజా సహకారంతోనే ఆ సవాలును ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. దొంగవ్యాపారుల మెప్పుకొరకు ప్రయత్నించితే ప్రభుత్వాధినేతలు ప్రజలకు దూరమవటం తథ్యం. అలాంటి పాలకవర్గాన్ని ఎవరూ రక్షించలేరు.

* * *

అందరు తాలూకా గూమాపలో బాల్ బాడ్మింటన్ బోర్డుమెంబరు శ్రీ గమిని గంగరాజు మెమోరియల్ ఆంధ్రా స్టేట్ ఎఫిలియేటెడ్ ద్వితీయ బాల్ బాడ్మింటన్ టోర్నమెంటు హోస్పియాక్ రిక్రియేషన్-క్లబ్బు ఆధ్వర్యమున నవంబరు రెండవవారంలో జరుగును

ప్రజల్ని మోసగించి లక్షలు కాజేస్తున్న జైన్ కుటుంబపు మోసకారి బ్రతుకు

శ్రీ ఎస్ పి జైన్ డైరెక్టర్లలో ఒక్కరుగా వున్న బెన్నెట్ కోల్మన్ అండ్ కంపెనీ (లిమిటెడ్) ద్వారా శ్రీ జైన్ చేసిన ఆర్థిక వంచనలు ఇటీవల బయటపడ్డాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా మొదలయిన గొలుసు పత్రికలపై యాజమాన్యం ఆ కంపెనీదే. భారత ప్రభుత్వం శ్రీయుతులు శాంతిప్రసాద్ జైన్, గ్యాన్‌చంద్ జైన్, అలోక్ ప్రకాష్ జైన్ పి. కె రాయ్‌లమీద వారు చేసిన ఆర్థిక వంచనలకు కేసుపెట్టి, ఈ కంపెనీ ఆఫీసులలోనూ ఇతరకంపెనీలలోనూకూడ వీరెవ్వరూ వుండకుండా తొలగించవలసిందని ట్రిబ్యునల్ ముందు దరఖాస్తు పెట్టింది. సెప్టెంబరు 17 న ప్రభుత్వం ఈ కేసు పెట్టింది.

ప్రభుత్వం వీరిమీద పెట్టిన ఆరోపణల ప్రకారం వారు లక్షల కొలది సొమ్ము కైంకర్యం చేశారు. వాటాదార్ల ధనం అపహరించారు. మోసం చేశారు. చట్టాల్ని ఉల్లంఘించారు. అపవ్యయం చేశారు. ఈ కేసులు పెట్టగానే జైన్‌లు ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన పంపేరు. ఆ కంపెనీ వ్యవహారాల నిర్వహణకు ఒక 'ట్రస్టు' ను నియమించవలసిందని దానిలో కోరారు. శ్రీయుతులు జయప్రకాశ్ నారాయణ్, శ్రీ ప్రకాశ్, విజయలక్ష్మి పండిట్, మరో ఇద్దరినీ ధర్మకర్తల సంఘానికి సభ్యులుగా సూచించారు. ఆ విధంగా ప్రజలలో సదభిప్రాయం ఏర్పరుచుకో గలమని వారి ఆశ.

ప్రభుత్వ దరఖాస్తులో పేర్కొన్న అకార్యకలాపములన్నీ 1955-63 ల మధ్య జరిగాయి. వానినిమాలాకలుంతటయంకరమైన అన్యాయాలు జరిగిపోతూంటే అధికారు లింతకాలం ఎల్లా కళ్ళుమూసుకొని వూరుకోగలిగారు అని ఎవరికయినా అనిపిస్తుంది.

రద్దు పత్రికలను అమ్మగా వచ్చిన ధనాన్ని శ్రీ ఎస్. పి. జైన్ కైంకర్యము చేశాడని ప్రభుత్వం ఆరోపణ. రద్దు పత్రికలను అమ్మగా వచ్చిన సొమ్ముకు లెక్కలు చూపేపద్ధతిని ఎస్ పి జైన్ 1955 అగస్టునుంచీ మార్పించాడు, అప్పటినుంచి 1960 సెప్టెంబరు వరకూ అయిదేళ్ళలోనూ ఒక్క బొంబాయిలోని కంపెనీ ఆఫీసు నుంచే రద్దు పత్రికల అమ్మకంద్వారా రమారమి 21 లక్షల 95 వేల రూపాయల ఆదాయం వచ్చింది. దానిలో 4 లక్షల 81 వేల రూపాయలుమాత్రం కంపెనీ లెక్కలలో జమకట్టారు. మిగిలిన 17 లక్షల 14 వేలనూ హరించి ఎస్ పి. జైనూ, ఆయన ఆర్డరు పొందినవారూ లేక ఆయన చెప్పిన రీతిలో వ్యయపరిచారు

ఆ ఆరోపణ ప్రకారం ఈ మోసం చేయడంలోకూడా కొత్తకొత్త మార్పులు తెచ్చారని చూపించబడింది

1957 జూలై కి పూర్వం మార్కెటుధరలు తెలుసుకొన్న తర్వాత పత్రికలరద్దును ఆ ప్రకారం పెద్దమొత్తాలుగా అమ్మేసేవారు. అంతవరకు టెండరు ప్రకారం అమ్మేరు. అయితే ప్రత్యేకంగా ఇద్దరికి మాత్రమే అమ్మేవారు. ఈ అమ్మకంపద్ధతి మానేసి, లాటు గుత్తన అమ్మకం ప్రారంభించామని అబద్ధం చెప్పి అనాటిలెక్కలుకూడా ఇన్‌స్పెక్టరుకు ఇవ్వలేదు. అధికారులకి చూపించడానికై లాటుగుత్తని అమ్మినట్లు దొంగరశీదులూ, పత్రాలూ తయారుచేస్తూ వచ్చారు

పదేళ్లకుగాని కళ్లుతెరవని ఆర్థికశాఖ అధ్వాన్నపుస్థితి

ఎస్ పి జైనూ, ఆయన కుటుంబీకులూ నిర్వహిస్తున్న కంపెనీల సొత్తులను లక్షల మొత్తాలలో కాజేశారనీ, ప్రజలనూ, ప్రభుత్వాన్నీ మోసగించేటందుకు లెక్కల పుస్తకాలలో పద్దులను తారుమారుచేశారనీ ట్రిబ్యునల్‌కు భారతప్రభుత్వ ఆర్థికశాఖ ఫిర్యాదు చేసింది. ఈ మోస కృత్యాలు 10 ఏళ్లుగా జరుగుతున్నట్లు ఫిర్యాదు తెలుపుతూంది. ఇంత కాలం ఆర్థికశాఖ ఏంచేస్తూంది? ఇకముందు ఇటువంటివి జరగకుండా ఆపుతుందా? అనే ప్రశ్నలకు ప్రజానీకం సమాధానం కోరుతూంది

ఆ వ్యవధికాలంలో న్యూస్‌ప్రింట్ రద్దుకు సంబంధించిన లెక్కలన్నీ సరిగానే వుంచారనీ కంపెనీ లెక్కల కెంత జమకట్టేరో యాజమాన్యం ఎంత కైంకర్యం చేశారో ఆ లెక్కల పుస్తకాలలో స్పష్టంగానే చూపారనీ అయితే ఈ పుస్తకాలు కొన్ని ధ్వంసం చేయబడినాయనీ ప్రభుత్వ ఆరోపణలలో ఒకటి

అనేక సంవత్సరాలుగా ఈ కంపెనీలో ఉత్పాదం వలన వచ్చిన రద్దూ, తుక్కూ బొంబాయి వ్యాపార లిమిటెడ్‌కు ఇవ్వబడుతూండనీ, ఆ కంపెనీ శ్రీ ఎ. పి. జైనది ఆయన బంధువులది అనీ, ఈ తుక్కుకి బాబు 84 వేల రూపాయలు ఏడాదికి ఇచ్చేవారనీ ప్రభుత్వ ఆరోపణ సారాంశం వుంది. ఆ అమ్మకంవలన ఏటా అంతకన్నా చాలా పెద్దమొత్తమే వచ్చి వుండాలిసిందనీ, కొందరు ఎక్కువ మొత్తం ఇస్తామని ముందుకు వచ్చినా, వారికి ఇవ్వకపోవడమేకాదు వారి కాగితాలనుకంపెనీ రికార్డుల నుండి దొంగతనంగా తీసివేశారనీ ప్రభుత్వం ఆరోపణ.

కంపెనీకి సంబంధించిన విలువైన యంత్రాలనూ, సామగ్రినీ, కంపెనీకి నష్టం కలిగించే విధంగా అమ్మేరారు. ఆ అమ్మకంమొత్తంలో కొంత భాగం మాత్రమే పుస్తకాలకు ఎక్కించారు. మిగతా సొమ్ము శ్రీ ఎస్. పి. జైనుకో, ఆయన ఆర్డరు పొందిన వారికో ఇచ్చచెప్పారు. ఈ విధంగా 1957-61 ల మధ్య రు 3 లక్షల 69 వేలను కైంకర్యం చేశారు. చిల్లర మల్లర అమ్మకాలనుండి మరో రు 1 లక్ష 6 వేల రూపాయలు తినేశారు.

ఏదో బాకీ వున్నదనే నెపంమీద మెస్సర్సు క్రాస్‌వర్డ్ (ప్రై) లిమిటెడ్ పేరున రు 2 ల. 21 వేల రూపాయలు ఖర్చు వ్రాసివుంది. అసలా పద్దుతీసి చూస్తేనే బాకీమాట అబద్ధమని తేలిపోతుంది. ఆ కంపెనీ అధ్యక్షపదవినుంచి విరమించుకొంటు శ్రీ రామకృష్ణ దాల్మియాకు శ్రీ ఎస్ పి జైన్‌కూ మధ్య ఏవో లావాదేవీకిగాను ఈ సొమ్ము ఆయనకు ఇచ్చేరని తెలుస్తూంది. అదే కంపెనీ పేర మరొకపద్దు రు 1 లక్ష 21 వేలకు ఖర్చు వ్రాసివుంది. ఆ చెక్కును శ్రీ రామకృష్ణా దాల్మియా తన కంపెనీలలో ఒకదానిద్వారా మార్పించు కొన్నారు.

బెన్నెట్ కోల్మన్ కంపెనీ నిధులనుంచి ఇల్లాగే లేని బాకీలు అనేకం చెల్లింపబడినట్లుగా ప్రభుత్వం ఫిర్యాదులో వుంది.

ఫిర్యాదుతో జతపరచిన పట్టికలోమరొకరికి 60 లక్షల రూపాయలు అడ్వాన్సుచేసినట్లు ఒక పద్దువుంది. బెన్నెట్‌కంపెనీ తాను అప్పుతెచ్చుకొన్నవారికి ఇచ్చే వడ్డీ రేటుకన్నా తక్కువ రేటుకి ఈ అప్పుయిచ్చారు. కొన్నిసందర్భాలలో వడ్డీ లేకుండా అడ్వాన్సులిచ్చిన పద్దులుకూడా కొన్నివున్నాయి. శ్రీ ఎస్ పి. జైన్‌కూ బెన్నెట్ కంపెనీ ఇతర డైరెక్టర్లకుచెందిన కంపెనీలకూ, కాంట్రాక్టర్లకూ ఇల్లాంటి అప్పులు ఇవ్వబడినాయి.

నియమాలను పాటించకుండా పెట్టుబడి పెట్టిన ఘటనలు కొన్ని వున్నాయి. బెర్గ్సన్ అండ్ కో (లిమిటెడ్)కు ఆ విధంగా పెట్టిన 18 లక్షలు, అటువంటివానిలో ఒకటి.

1955 అక్టోబరులో నియమాలకు విరుద్ధంగా ప్రిఫరెన్సు వాటాలమీద 1949 నుంచి 54 వరకూ బకాయిపడి వున్న డివిడెండ్లను కంపెనీ చెల్లించింది. అనాడు కంపెనీ ఇవ్వగలస్థితిలోలేదు. ఈ విధంగా భారత్ యూనియన్ ఏజన్సీస్‌కు శ్రీ ఆర్. కె డాల్మియా ఆదేశానుసారం 28 లక్షల 64 వేల రూపాయలను చెల్లించింది. శ్రీ దాల్మియా అతఃపూర్వం కంపెనీ చైర్మన్‌గా వుండేవారు. ప్రిఫరెన్సు వాటాలు ఆయనకేదుక రిజిస్టరు అయి వున్నాయి.

లాభాలులేకున్నా డివిడెండ్లు

ఆ ఏడాది డివిడెండ్లు పంచేటందుకు తగినన్ని లాభాలు రాకున్నా, జైన్ కుటుంబానికి సంబంధించిన 'నేషనల్ కంపెనీ - భారత్‌నిధి లిమిటెడ్'నుంచి 60 లక్షల రూపాయలు అప్పు తీసుకొనేటందుకు నిర్ణయించేస్తూ ఒకతీర్మానమూ మరో కొద్దిరోజులకు ఆ డివిడెండు ఇచ్చివేయడానికి నిర్ణయిస్తూ వేరొక తీర్మానమూ చేసి ఆ ధనం ఇచ్చివేశారని ఫిర్యాదులో వివరించారు. ఈ డివిడెండు ఇవ్వటం గురించి ఇన్‌స్పెక్టరు వారికు ప్రారంభం లేకా ఈ తీర్మానాలుచేసి, ఆ కాగితాలను పుస్తకాలలో అతికించారని దానిలో చెప్పారు.

మరొకటి కూడా చెప్పబడింది. శ్రీ ఎస్. పి. జైన్‌గాని ఆయన బంధువులుగాని, వారికి సంబంధించిన ఇతరులుగాని కంపెనీకి డబ్బు ఇవ్వవలసి వచ్చిన సందర్భాలు వచ్చినప్పుడు అబద్ధపు బాకీ పత్రాలు సృష్టించి కొట్టివేస్తూ వచ్చారనీ కంపెనీ అధ్యక్షుడు శ్రీ ఎస్ పి. జైనూ ఆయన మిత్రులూ, బంధువులూ కంపెనీ ఖర్చుమీద సుఖభోగాలు పొందడాన్నీ, కంపెనీ సొమ్మును వినియోగించుకోవడాన్నీ సమర్థించుకొనేటందుకై కంపెనీ రికార్డులనూ, జమాఖర్చులనూ తారుమారుచేస్తూ వచ్చారనీ ఫిర్యాదు తెలుపుతూంది

ఈ విశాలమైన కైంకర్యాలు చేయడమేగాక, నియమాలకూ నిబంధనలకూ వ్యతిరేకంగా కంపెనీ ఆదాయ వ్యయాలను నిర్వహించడంలో తప్పుడు పద్ధతుల నవలంబించారని చెప్పింది.

ఈ సందర్భంలో నిర్దిష్టమైన ఆరోపణలు చేయబడ్డాయి

1 అడ్వర్టయిజ్‌మెంటు ఆదాయానికి సంబంధించిన లెక్కలు వ్రాయడంలో 1957 లో ఒకమారూ, 1961 లో ఒకమారూ మార్పులు చేశారు. ఆ మార్పులో 1957 ఎక్కౌంటులో 11 నెలల అడ్వర్టయిజ్‌మెంటు ఆదాయం మాత్రమే లెక్క కట్టబడింది. 1961 లో 13 నెలల ఆదాయాన్ని లాభనష్టాల జమాఖర్చులలోకి తీసుకొన్నారు

2 మెటల్ టైప్ ఎక్కౌంట్లలోకూడ ఇల్లాంటి మార్పు చేశారు. 1956 లో మెటల్ లెక్కలు పూర్తిగా తీసివేశారు రద్దుపరచేశారు. కాని 61 లో మెటల్, టైప్‌లకు తిరిగి ఖరీదు కట్టి రు 4 65,475 ల అదనపు విలువ చూపించారు. మరల 1961 డిసెంబరు 31 న తయ్యారీ సరుకులు రు 65,450 లవి లెక్క చూపారు. అంతకు పూర్వం ఆ పేరుగల ఖాతాయే లేదు ఎప్పుడూను.

లెక్కల గారడీ

1957 లో కంపెనీ లాభాలు తగ్గింది చూపడానికి ఈ మార్పులు చేశారు. పెట్టుబడివాటాల కంట్రోలరుకు కంపెనీ నిజస్థితి తెలియకుండా చేయాలని వారి ప్రయత్నం. అదనపు వాటాలు అమ్మితే కంట్రోలరు ప్రీమియమ్ విధిస్తారు. అది దాటవేయడానికి వారు ఈ మార్పు చేశారు. దీనివలన కంపెనీ నష్టపడినా, అసలు వ్యక్తికి లాభమేకదా? 1960 లో కంట్రోలరు అనుమతి తీసుకొన్నారు. 1961 లో కృత్రిమంగా లాభాలు హెచ్చు చూపారు. దాని ద్వారా వరుస నిలవలు, పుస్తకలలో కనబరచిన అప్పులమీద అదనంగా అప్పు సంపాదించవచ్చును

కంపెనీ లాభాలు ఎక్కౌంట్లలో బుద్ధిపూర్వకంగా చేసిన ఇల్లాంటి గారడీలను ఫిర్యాదులో వివరించారు.

ఈ చిట్టా అంతా ఇచ్చి, ఆర్థికశాఖ విచారణాధికారులకు ఒక విజ్ఞప్తి చేసింది. బెన్నెట్ కోల్మన్ కంపెనీకిగాని మరే కంపెనీకి గాని ఈ నేరస్థులు డైరెక్టర్లుగా వుండడానికి గాని, కార్యనిర్వహణ బాధ్యత వహించడానికి గాని తగరని తీర్పు నివ్వవలసిందిగా కోరింది.

కేసు యొక్క అవసరాలను బట్టి తర్వాత: తర్వాత ఇంకా ఇతర శిక్షలను కోరే అవకాశం ఇవ్వవలసిందిగా ట్రిబ్యునలును మరొకటి కూడా కోరింది.

జైన్ కుటుంబీకులు చేస్తున్న తప్పులకు శిక్షవేయవలసిందిగా కోరడానికి ఆర్థికశాఖ వారికి అంత తటపటాయింపు ఎందుకో? అర్థం కాదు. వారు చేసిన మహామోసాలనుగురించిన సాక్ష్యాధారాలను ఆకంపెనీలోపనిచేస్తున్న పెద్ద వుద్యోగులే ప్రభుత్వానికి అందజేశారు. కాని ఆర్థికశాఖ చాలకాలం జాగు చేసింది. చివరకి నాడు కేసుపెట్టినా ఎంతో అస్పష్టంగా తటపటాయిస్తూ ముందుకు వస్తూంది.

చిట్టవివరములిలాగైతేనేం జైన్ కుటుంబీకుల మీద కేసు పెట్టినందుకు అభినందించినా ఇలా జాప్యం ఎందుకు జరుగుతూందని ప్రశ్నించే హక్కుప్రజలకుంది. కనీసం ఇలాంటిద్రోహాలు మళ్ళీ జరక్కుండా చూడడం ముఖ్యం. సద్బుద్ధులూ న్యాయమైన గుత్తనాశీమీసనులు గురించి ఉపన్యాసాలిచ్చి ప్రజలు కళ్ళు కప్పకుండా ఆర్థికశాఖ ఆ హామీనిస్తుందా?

— (న్యూఏజ్, అక్టోబరు 4)

అనంతపురంజిల్లాలో పంటలు నష్టం

పదిలక్షల రూపాయలమేరకు ఉండవచ్చునని అధికారుల అంచనా

అనంతపురం, అక్టోబరు 3

అనంతపురంజిల్లాలో గతమాసం ఆఖరు వారంలో కురిసిన భారీవర్షాలవల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ టి రామచంద్రారెడ్డిగారు పర్యటించారు. వారివెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ టి. భోగిరెడ్డిగారు కూడా వున్నారు. మొత్తం జరిగిన నష్టం అంచనావేస్తే అన్ని రకాలవంట పూతకలిసి పదిలక్షలుంటుందని అంచనా.

ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకసిర తాలూకాల్లో అతివృష్టివల్ల, వరదల వల్ల పాడైపోయిన పంటభూములను, రోడ్లను తెగిపోయిన చెరువులను వీరు చూశారు. అష్టకష్టాలపాలైన పేద ప్రజానీకాన్ని కలుసుకున్నారు. పరామర్శించారు. వారికి తగుసాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

ధర్మవరం తాలూకాకు చెందిన కుంటిమద్ది చెరువు, వాదాపురం తాలూకా పులమతి గ్రామం చెరువు శ్రీకంఠపురం చెరువు కొటిపి చెరువు మడకసిర తాలూకా మండలహాళ్ళి చెరువులవల్ల విపరీత నష్టం జరిగింది.

గతనెల 30 మధ్యాహ్నం జిల్లా పరిషత్ చైర్మన్, ఇతర అధికారులు ఇక్కడకువచ్చారు. కొడిగెనహళ్ళి పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ మాదిరి నారాయణరెడ్డి, మడకసిర సమితి అధ్యక్షులు శ్రీ వై. పి. తిమ్మారెడ్డి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు శ్రీయుతులు వ్యాసకుమార్, మనుమూకనరాజు ప్రభృతులు వీరి వెంట వచ్చారు.

తాలూకాలోని పులమతి, శ్రీకంఠపురం, కొటిపి చెరువులను పరిశీలించారు. మైసూరు రాష్ట్రపు చెరువులు తెగివచ్చిన వరద నీరువల్ల పైచెరువులన్నీ నిండి కట్టలు తెంచుకొని అనేక పంటభూములను రోడ్లను పాడుచేసినవి. రాకపోకలకు అంతరాయం కలిగింది. రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభమైనవి.

హిందూపురం తాలూకాలోని పులమతి కొటిపి శ్రీ కంఠాపురం చెరువుల కట్టలు తెగిపోవడంవల్ల సుమారు 350 ఎకరాల రాగి, వేరుశనగ, వరిపంట భూములకు తీరని నష్టం కలిగింది. పులమతి, చల్లపల్లెగ్రామంలో దాదాపు 60-70 మట్టిఇళ్లు కూలిపోయినవి. నివాసగృహాలులేక పేద ప్రజానీకం అష్టకష్టాల పాలయ్యారు.

హిందూపురం,లేపాక్షి రోడ్డుపై శ్రీ కంఠాపురం చెరువుకు అవుపోట్ల గండ్లు పడినవి. 200 అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల లోతుగల గండి రోడ్డుపై ఏర్పడ్డది. ఈ గండి వల్ల హిందూపురం, కదిరి రాకపోకలు నిలిచిపోయినవి. శివపురం గ్రామం జనమీ సానం 7/1 మైలురాయి ఇంతవరకు మునిగిపోయినది.

అన్నిరకాల పంటల నష్టం దాదాపు పది లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు.

గోవిందాపురం, మదుడి, మండలహాళ్ళి గ్రామాలు తరచప్రమాదానికి గురియైనవి. వర్షముకురిసి పొంగడంవల్ల 12 రోజుల ముడతెరిపి లేక ప్రవాహం పంటభూములను ఇసుక మేటలతో కప్పివేసి అపారనష్టం కలిగించినవి. రాగి జొన్న వేరుసెనగ, కొర్ర అండుకొర్ర పంటభూములు దెబ్బతిన్నవి. భూమి కోసివేయబడినవి.

మదూడి గ్రామానికి చెందిన భూములకు నీరు వరదలకారణంగా చెరువుల్లో కొట్టుకుపోయి కాలువలు పూడిపోయినవి. విపరీత వర్షములవల్ల మదూడి గ్రామంలో దాదాపు 40 మట్టిమిద్దెలు కూలిపోయినవి. కొన్ని బావులు పూడిపోయినవి. 3 పంపు ఇంజన్లు గదులు కూలిపోయి ఆ అస్సు చెడిపోయినవి.

దాదాపు 10 వేల విలువచేసే పంట భూములు పాడైపోవడంవల్ల మొదటి పంటపై [illegible] అద్యవలసిందిగా గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శ్రీ పాత లింగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవలసిందిగాకూడా చైర్మన్‌ను కోరారు. మండలహాళ్ళి గ్రామం చెరువు తెగిపోయిన చోటును మైసూరు నుంచి పర్యటించిన జిల్లా పరిషత్ చైర్మన్ బృందం పరిశీలన జరిపారు. వారిలో గండు పడినచోట్లు పడిపోయిన మోతలు, పాడైపోయిన పంట భూములు హృదయాన్ని కలతపరచినవి.

"వ్యవసాయ కూలీలకు విరివిగా సహాయంచేయండి"

రైతులకు శ్రీ వడ్డె శోభనాద్రి విజ్ఞప్తి

విజయవాడ అక్టోబరు 3

సామాన్యంగా గ్రామాలలో ఏడాదికి మూడు మాసాలు మాత్రమే వ్యవసాయ కూలీలకు పనులు దొరుకును. ఇటీవల కురిసిన భారీ వర్షాల ఫలితంగా రాష్ట్రంలో పంటలకు విపరీత నష్టాలు కలిగాయి. ఈ పరిస్థితుల్లో పనులులేక గ్రామాలలోని వ్యవసాయకూలీలు ఆహారధాన్యాలకు అలమటించి పోతున్నారు. కనుక గ్రామాల లోని భూస్వాములు తమ విద్యుక్త ధర్మంగా భావించి, వ్యవసాయ కూలీలకు ఉదారంగా ధాన్యం డబ్బు రూపేణా తోడ్పడాలని కృష్ణా జిల్లా రైతు ప్రముఖులు శ్రీ వడ్డె శోభనాద్రి ఒక ప్రకటన చేస్తున్నారు.

వరదలవల్ల జరిగిన నష్టం విషయంలో ప్రభుత్వ బాధ్యత

శ్రీ వై. వి. కృష్ణారావు ప్రకటన

హైద్రాబాద్, అక్టోబరు 4

బుడమేరు, తమ్మిలేరు, ఎర్రకాల్వలపై రిజర్వాయర్లు నిర్మించి వుంటేను మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించి వుంటేనూ వరదలవల్ల కోట్లాది నష్టం జరుగుతూ వుండేది కాదనీ, అందువల్ల ప్రజలకి జరిగిన నష్టానికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించవలసి వుందనీ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ వై. వి. కృష్ణారావు నేడొక ప్రకటన చేశారు

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాజెక్టులు, పంటెనలు వరదలవల్ల దెబ్బతినడానికి కారణమేమో పరిశీలించి తగు చర్యలు తీసుకోవడానికి నిపుణుల కమిటీని నియమించాలని, వరద బాధితులకు తక్షణ సౌకర్యాల అందజేయటానికి ఎక్కువగా ద్రవ్యమివ్వాలనీ కోరారు

శ్రీ వై. వి. కృష్ణరావు ప్రకటన పూర్తి పాఠమిది:

ఇటీవల వరదలవల్ల అం తరలోనిపంటలు, ఇళ్లు, ఇతర ఆస్తి విపరీతంగా నష్టమయింది. కృష్ణ గుంటూరు పశ్చిమగోదావరి, మహబూబ్‌నగర్ జిల్లాలలో లక్షలాది ఎకరాలలోని పంట పూర్తిగా వరదపాలయినట్లేసవేదికారు. రెండువందలకుపైగా జనం చనిపోయారని కూడ తెలుస్తోంది, కృష్ణవరదవల్ల నాగార్జునసాగర్ వద్దగల పంతెన కొట్టుకొనిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో అనేక చెర్వులకు గండ్లుపడ్డాయి

ఫలితంగా లక్షలాది ప్రజలు ఎంతో నష్టపడ్డారు. పాడయిపోయిన పంట విలువ అనేక కోట్లుంటుందని అంచనా. వరదబాధితుల కందరికీ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ తరపున సానుభూతి తెలియజేస్తున్నాను.

అయితే ఈ అపారనష్టం అనివార్యమయినదా అనేది మనలనందరినీ నేడు కలవరపెడుతున్న సమస్య. అనివార్యం కాదని నా నిశ్చితాభిప్రాయం. ఈ నష్టం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యతలేదని చెప్పలేము, బుడమేరు, తమ్మిలేరు, ఎర్రకాల్వలపై రిజర్వాయర్లను నిర్మించి వుంటే, కృష్ణా, పశ్చిమగోదావరిజిల్లాలు ఇంతటి నష్టానికి గురి అయివుండేవికావు, విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్‌కు, ఏలూరు పట్టణానికి నష్టం సంభవించివుండేదికాదు. ఈ రిజర్వాయర్ల నిర్మాణానికి అయ్యే వ్యయం వరదలవల్ల ఒక్క ఏడులో జరిగిన నష్టంలో కొద్ది భాగానికికూడా సమానంకాదు.

కొన్ని సంకుచితమైన రాజకీయ ప్రయోజనాలు బుడమేరు రిజర్వాయరు నిర్మాణానికి ఆటంకంగా పరిణమించాయనేది అందరికీ తెలుసు

డెల్టాప్రాంతంరైతుల విజ్ఞప్తిమేరకు ప్రభుత్వం నెరవేర్చ వలసిన మరొక కనీస ధర్మం- మురుగుకాల్వల మరమ్మత్తు. మురుగు కాల్వలను సరిగా మరమ్మత్తు చేయకపోవడంవల్ల ఏటా కొన్నికోట్ల పంటనష్టం జరుగుతూ వుందని అంటినా ఇందుకు బాధ్యత సంపూర్ణంగా ప్రభుత్వమే వహించవలసివుంది.

చెరువులకు గండ్లు పడినందున ప్రభుత్వాన్ని నిందించలేము కాని, నాగార్జున సాగర్ వద్ద పంతెనకు, పరకాసాగర్ ఆనకట్టకు గండ్లు పడటం యాదృచ్ఛికముకాదు

పెద్ద ఎత్తున వరదలు వచ్చాయి కాబట్టి ఇలా జరిగి పోయిందనే వాదన ఎవరినీ నమ్మించదు. ఇలాంటి నిర్మాణాలకు గండ్లు పడితే జరిగేనష్టం చిన్నది కాదు. డామ్, పంతెనో నిర్మించేటప్పుడు వరద కాలంలో గరిష్ట నీటి మట్టమూ, ప్రవహించే గరిష్ఠ జలపరిమాణమూ ప్రవాహవేగమూ మొదలగు అంశాలన్నీ సహజంగా గణనలోనికి తీసుకొంటారు. అయినప్పటికీ మన రాష్ట్రంలో కడెం, కోలంగా నుల్ల మధ్య మొదలగు రిజర్వాయర్లు దెబ్బతిన్నవి? పంతెన వరదల్లో దెబ్బతినడానికి కారణమేమి? అవి నిర్మాణంలో జరిగిన లోపమా లేక వీటి నిర్మాణ నమూనాలు తయారు చేయటంలో జరిగిన లోపమా? ఈ సమస్యను నిపుణులు పరిశీలించడానికి ప్రభుత్వం వెంటనే కమిటీని నియమించాలి

ప్రభుత్వం వెంటనే వరద బాధితులకు అవసరమైన సహాయం అందించాలి. బుడమేరు, తమ్మిలేరు ఎర్రకాల్వ రిజర్వాయర్లను నిర్మించడానికి,మురుగుకాల్వల మరమ్మతుకు అత్యంత ప్రాధాన్య మివ్వాలి. వరదలవల్ల నష్టపడ్డ ప్రాంతాలలో విరివిగా తక్కావీ అప్పులు ఇవ్వాలి. సహకారసంఘాలద్వారా ఇతోధిక ఋణ పరపతి సౌకర్యాలు కలిగించాలి. శిస్తురెమిషన్ ఇవ్వాలి."

టంగుటూరులో పంచదార కొరత

టంగుటూరు, అక్టోబరు 1

పంచదార కొరతకు గుంటూరుజిల్లా టంగుటూరు గ్రామ ప్రజలు గురవుతున్నారు. ఈ సంవత్సరం ఆరంభంనుంచీ సుమారు ఆరు నెలలపాటు అసలు పంచదార సప్లయి లేక ప్రజలు ఆందోళన చేయగా, జూలైలో ఉద్యోగుల కుటుంబములకు రెండు కిలోలు ఇతరులకు ఒక కిలోగ్రాము చొప్పున పంపిణీ జరిగింది. ఆగస్టు నెలలో ఉద్యోగులనే తారతమ్యం లేకుండా ప్రతి కుటుంబమునకు ఒక కిలోగ్రాము చొప్పున మాత్రమే ఇచ్చినారు. సెప్టెంబరు నెలలో అసలు పంపిణీ అంటూ జరుగలేదు. ప్రజలు బాధలు పడుతున్నారు.

శ్రీ తాపీ ధర్మారావు గారికి పాలకొల్లులో సన్మానం

పాలకొల్లు అక్టోబరు 3

సుప్రసిద్ధ సాహితీవేత్త, పండితులు, సామాజిక పరిశోధకులు, పత్రికా రచయిత అయిన శ్రీ తాపీ ధర్మారావుగారికి పాలకొల్లు మహాత్మా మైత్రీ బృందం' వారు గతరాత్రి ఘనమైన సన్మానం చేశారు. మహాత్మాగాంధీ జన్మదినోత్సవాలలో తొలిరోజు కార్యక్రమంగా ఈ సంస్థ ఈ సన్మానం జరిపింది.



సన్మానసభకుముందు శ్రీ ధర్మారావుగారిని పాలకొల్లుహైస్కూల్, మహాత్మామైత్రీ బృందం కమిటీసభ్యులు స్వయంగా మోసి, కొమ్ముబూరా వాయిద్యాలతో సభాస్థలానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. సంస్థ గౌరవాధ్యక్షులు శ్రీ దుమ్మల సత్యనారాయణమూర్తిగారు, ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు శ్రీ పసల సూర్యచంద్రరావుగారు స్థానిక ప్రముఖులు, పౌరసన్మానితులు సభాపూర్వ ఊరేగింపుతో నడిచివెళ్ళారు.

సభకు అధ్యక్షత వహించిన శ్రీ దుమ్మల సత్యనారాయణమూర్తిగారు, "మహాత్మామైత్రీ బృందం' లక్ష్యాలను వివరించారు. శ్రీ ధర్మారావుగారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవను కొనియాడారు.

తరువాత, సంస్థ తరపున ధర్మారావుగారికి దుశ్శాలువ కప్పి నూతన వస్త్రాలతో, చందన తాంబూలాది సత్కారాలతోపాటు సన్మానించారు. వేదికపై వున్నవారంతా వారిపై పుష్పవృష్టి చల్లారు. సన్మానపత్రం సమర్పించారు.

మహాత్మా మైత్రీ బృందం కార్యకర్త శ్రీ జాన్ నాగేశ్వరరావుగారు ప్రసంగిస్తూ, ధర్మారావుగారు రచించిన "దేవాలయాలమీద బూతుబొమ్మలెందుకు" అన్న గ్రంథం మూఢ నమ్మకాలపై దెబ్బతీయడానికి ఎలా తోడ్పడుతున్నదీ తెలిపారు.

శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవిగారు ప్రసంగిస్తూ, ధర్మారావుగారి బహుముఖ సాహితీ సేవనుగురించి వివరించారు. 'పెళ్లి - దాని పుట్టుపూర్వోత్తరాలు", దేవాలయాల మీద బూతుబొమ్మ లెందుకు వంటి గ్రంథాల ద్వారా సామాన్య పాఠకలోకంలోనూ నూతన జ్ఞానోదయం కల్పించారన్నారు.

వేమవరపు వేంకటకవి విరచిత "విజయవిలాసం" గ్రంథానికి శ్రీ ధర్మారావుగారు రాసిన వ్యాఖ్యానం విశిష్టతను గురించి ప్రస్తావించి అది త్వరలో ముద్రణకాగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

శ్రీ పసల సూర్యచంద్రరావుగారు ప్రసంగిస్తూ శ్రీ ధర్మారావుగారు గొప్పపండితులే కాకుండా మహామనీషికూడా అని అన్నారు.

శ్రీ ధర్మారావుగారు తమకు సన్మానం జరిపిన మహాత్మా మైత్రీబృందంవారికి, పాలకొల్లు పౌరులకు ధన్యవాదాలర్పించారు.

అర్థంతెలిసి రాసే కవితకూ, అర్థం తెలియకుండా రాసే కవితలకూ వ్యత్యాసాన్ని గురించి చెబుతూ, మనుచరిత్ర, వసుచరిత్ర, విజయవిలాసం గ్రంథములనుంచి ఉదాహరణలు చూపారు.

నేటి యువతరంవారు తమ ఇతర కార్యకలాపాల్లో నిమగ్నులు కావడంతోపాటు, సాహిత్యాభిరుచికూడా అలవరచుకోవడం, వారి మనసుకు కొంత హాయిని కలిగించడమే కాకుండా, వారి వికాసానికికూడా దోహదం కూర్చగలదనీ అందుచేత ఈ విషయంపై శ్రద్ధవహించవలసిందని ఉద్బోధించారు. తన ప్రసంగం ముగించారు

అంతకుముందు, గాంధీ జయంతి ఉత్సవాలను ప్రారంభించే సందర్భంగా శ్రీమతి అద్దేపల్లి వివేకానంద దేవిగారు ప్రసంగిస్తూ గాంధీగారు దేశంలో [illegible] అవినీతి, [illegible] ఏలా ఏలాయ ఆరాటం చేస్తున్నారో తెలి

(మిగతా 3 వ పేజీలో)

కాకినాడ జాలరులలో 420 మంది తిరిగి రాక

మిగిలిన 32 మంది కోసం ఇంకా గాలింపు

కాకినాడ, అక్టోబరు 3

కాకినాడ పరిసర గ్రామాలకు చెంది సెప్టెంబరు 26 వ తేదీన సముద్రంలోకి చేపలకోసం వెళ్ళిన 450 మంది జాలరులలో ఇప్పటికి 420 మంది తిరిగివచ్చారు. అందులో స్పృహ లేని స్థితిలో ఉన్న ఒక వ్యక్తి ఒడ్డుకు రాగానే మరణించాడు.

ఇప్పటికి 72 నావలు దొరికాయి. మిగిలిన మూడు నావలు, 32 మంది కోసం ఇంకా వెతుకుతున్నారు.

ఈ వేళ ఉదయం యానాం వద్ద కొన్ని నావలు కనబడ్డాయని తెలిసి కాకినాడ నుండి కొన్ని లాంచీలను పంపారు. 30 మంది జాలరులను ఆరు నావలను ఈ లాంచీలు తీసుకొని వచ్చాయి

ఆరుగు జాలరులను రక్షించి మద్రాసు రేవుకు ఒక వాణిజ్యనౌక చేర్చింది. వారుకూడా ఇక్కడకు చేరారు.

విమానాలు, నౌకలు మిగిలిన వారికోసం ఇంకా అన్వేషణ సాగిస్తున్నాయి.

పేరుపాలెం వద్దకు కొట్టుకువచ్చిన పది మంది జాలరులు

నర్సాపురం అక్టోబరు 2

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం తాలూకా పేరుపాలెం సముద్రపు ఒడ్డునకు 10 మంది మత్స్య కార్మికులతో ఒక పడవ చేరినది కండ్లలో ప్రాణాలు పెట్టుకొని శక్తిహీనులై వున్నారు.

వీరు గత 30 వ తేదీన వీచిన పెద్ద గాలి వానకు కాకినాడ సముద్రము నుండి లోపలికి కొట్టుకొని పోయారట. రెండు రోజులు లోతు సముద్రములోనే వుండిపోయారు ఈ దినం ఉదయం పేరుపాలెం వద్దకు చేరుకొన్నారు. వీరిని గ్రామ కరణం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టరు ఒడ్డుకొని నర్సాపురంతహసీల్దారు సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి వర్ష సూచన

మద్రాసు, అక్టోబరు 3

5 వ తేదీ వరకు ఆంధ్ర కోస్తా జిల్లాలలో, రాయలసీమ ప్రాంతాలలో తేలిక వానల నుండి ఒక మోస్తరు వర్షాల వరకు పడవచ్చును.

తరువాత రెండు రోజులలో ఆంధ్ర దక్షిణ కోస్తాజిల్లాల్లోవర్షం ఎక్కువవ్వే సూచనఉంది. అని అన్నారు.

బళ్లారిలో 144 వ సెక్షన్ పొడిగింపు

బళ్లారి, అక్టోబరు 3

అసిస్టెంట్ కమిషనర్ శ్రీ యం. పి. బేగ్ నేటినుండి వారంరోజుల వరకు 144 వ సెక్షన్ నిషేధాజ్ఞలను తిరిగి బళ్లారిలో పొడిగించారు

ఈ నిషేధాజ్ఞలు అక్టోబరు 8 వ తేదీవరకు అమలులో వుంటాయి

అంతవరకు బళ్లారిలోగాని, బళ్లారికి 5 మైళ్ళ దూరంలో ఇంకెక్కడా సభలు ఊరేగింపులు 5 గుర్కి మించి సమావేశాలు జరగరాదని ఈ 144 సెక్షన్ నిషేధిస్తున్నది.

ప్రతిపక్ష పార్టీలు నిర్వహించిన భారత హర్తాళ్ సందర్భంలో బళ్ళారిలో ప్రజలపై కాల్పులు జరిగిన విషయం పాఠకులకు విదితమే.

రైల్వేల విస్తరణకు 6 కోట్ల 2 లక్షల డాలర్ల రుణం

ప్రపంచ బ్యాంకుతో సంప్రదింపులు

న్యూఢిల్లీ, అక్టోబరు 3

భారత రైల్వేల విస్తరణ కార్యక్రమానికి ప్రపంచ బ్యాంకు నుండి 6 కోట్ల 20 లక్షల డాలర్ల అప్పుపొందే విషయమై సంప్రదింపులు సాగుతున్నాయి.

ప్రస్తుతం అమెరికాలో ఉన్న రైల్వేబోర్డు చైర్మన్ ప్రపంచ బ్యాంకుఅధికార్లతో యీ విషయమై చర్చలు జరుగుతున్నాయి.

హెచ్. యం. టి. నాల్గవ ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభం

ఎర్నాకుళం, అక్టోబరు 3

హిందూస్థాన్ యంత్ర పరికరాల నాల్గవ ఫ్యాక్టరీని కేరళలో నిర్మించటం ముదావహమని ఇంత వ్యాపార పథకాన్ని సాధించటం కూడా విశేషమని హిందూస్థాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీ చైర్మన్ ఫిలిప్స్ చెప్పారు.

ఇక్కడకు దగ్గరలో నిర్మింపబడిన ఫ్యాక్టరీ ఆవరణలో చేరిన అధికారులను, కార్మికులను ఉద్దేశించి ఫిలిప్ ప్రసంగిస్తూ ఈ ఫ్యాక్టరీని సంపూర్ణంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంతకు ముందు హిందుస్థాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరక్టరు శ్రీ ఎస్. ఎం. పటేల్ ప్రసంగిస్తూ మిగతా ప్రాంతాలలోని హెచ్. యం. టి. యూనిట్ల కంటే కేరళలో నిర్మింపబడిన ఈ ఫ్యాక్టరీ ఎక్కువ విజయాలను చేపట్టగలదని అన్నారు.

మహాత్మా గాంధి, ప్రధాని శాస్త్రి జన్మదినోత్సవ సందర్భంలో ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభం కావటం ఎంతో గర్వించదగిన విషయమని అయన అన్నారు

ఎర్నాకుళానికి 8 మైళ్ళ దూరంలో ఉన్న కలమస్సేరిలో ఈ ఫ్యాక్టరీ నిర్మింపబడింది

దీనికి ఫిలిప్ ప్రారంభోత్సవం జరిపారు. దీనికయిన ఖర్చు రు. 7 కోట్ల 75 లక్షలు. ఫ్యాక్టరీని డిజైన్ చేయటం, నిర్మింపటం అంతా భారతీయుల ఆధ్వర్యానే జరిగింది. ఎట్టి విదేశీ సహాయం తీసుకోలేదు దీని కయినఖర్చు హెచ్. యం. టి. బెంగుళూరు ఫ్యాక్టరీల నుండి సేకరింపబడింది.

ప్రజాచైనా 15 వ వార్షికోత్సవం

లీషావ్‌చీ, పెంగ్‌చెన్‌ల ప్రసంగాలు

పెకింగ్ అక్టోబరు 1

ప్రజాచైనా 15 వ వార్షికోత్సవ సందర్భంలో నేడు పెకింగ్ స్క్వేర్‌లో 5 లక్షల మంది బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు

చైనా కమ్యూనిస్టు పార్టీ చైర్మన్ మావో సేటుంగ్, తదితర చైనా నాయకులు, మరో 3 వేల మంది విదేశ అతిథులు, ఈ ప్రదర్శనను తిలకించారు.

చైనా అధ్యక్షుడు లీషావ్‌చీ ఈ సందర్భంలో ప్రసంగిస్తూ అమెరికా అనుసరిస్తున్న దురాక్రమణపూరిత యుద్ధోన్మాద విధానానికి వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా దక్షిణ అమెరికాలలోని యావన్మంది ప్రజలు ఐక్యంకావాలని అన్నారు. అమెరికా దురాక్రమణకు గురికాబడిన ప్రజలకు చైనా ప్రజల అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని అయన చెప్పారు.

దాదినహస్తంతో మావో నిలబడిఉన్న పెద్ద చిత్రపటాన్ని అగ్రభాగాన ఉంచగా ఈ ప్రదర్శన ప్రారంభమయింది. చైనా పారిశ్రామిక, సాంకేతిక, వ్యవసాయ అభివృద్ధినిచూపే మరికొన్ని పటాలను ప్రదర్శించారు.

పెంగ్‌చెన్ ప్రసంగం

చైనా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెకింగ్ మేయరు అయిన పెంగ్‌చెన్ ప్రసంగిస్తూ చైనా చరిత్రలోనే 1964 సంవత్సరం పంటలు సమృద్ధిగా పండిన సంవత్సరంగా ఉంటుందని అన్నారు. చైనా ఆర్థిక పరిస్థితి ఇంతకుముందు ఏనాడు లేనంత మెరుగుగా ఉన్నదని అయన అన్నారు

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన ప్రమాదమయిన ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా చైనా ప్రజలు కృతనిశ్చయముతో పోరాడుతారు.

"ప్రతి సంవత్సరం, ప్రతినెలా, వివిధరంగాలలో మనం చేసిన పనిలో అనేక లోపాలు, తప్పులు దిద్దుబాటు చెందించాయి వాటిని మనం అధిగమించాలి అని పెంగ్‌చెన్ అన్నారు.

ఇతర దేశాల కమ్యూనిస్టుపార్టీలపై మన అభిప్రాయాలను రుద్దరాదు అని వేరు అయన అన్నారు.

ప్రదర్శన సందర్భంలో అనేక పావురాలను ఎగరవేశారు, మావోను పొగుడుతూ నినాదాలు ఇచ్చారు.

పార్లమెంటు హక్కుల రక్షణ

తొందరపడి రాజ్యాంగాన్ని సవరించరాదని న్యాయమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబరు 3

ఉన్నత న్యాయ స్థానాల తీర్పు ఫలితంగా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల హక్కులకు భంగం కలగకుండా కాపాడేటందుకు రాజ్యాంగాన్ని సవరించాలనే విషయం తొందరపడరాదని న్యాయమంత్రి శ్రీ ఎ. కె. సేన్ యీ రోజు రాజ్యసభలో చెప్పారు.

ఉత్తరప్రదేశ్ శాసనసభకు హైకోర్టుకు ఇటీవల యేర్పడిన వివాదం గురించి సుప్రీం కోర్టు వెల్లడించిన అభిప్రాయంపై చర్చ జరిగిన సందర్భంలో అయన పై విధంగా చెప్పారు.

సుప్రీం కోర్టు అభిప్రాయంలో ఇమిడి వున్న అంశాలను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలిస్తున్నది. వచ్చే పార్లమెంటు సమావేశానికి ప్రభుత్వం ఈ సమస్యపై తన అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. అని చెబుతూ న్యాయస్థానాల గౌరవ ప్రతిష్ఠకు భంగకరమైన విషయాలు వేటినీ సభలో లేవద్దని అయన సభ్యులకు విజ్ఞప్తి చేశారు

ఈ సమస్యపై అంతకుముందు సభలో అరగంటసేపు చర్చ జరిగింది. రాజ్యాంగ చట్టాన్ని వెనువెంటనే సవరించాలని కొందరు సభ్యులు కోరారు మరి కొందరు న్యాయస్థానం తీర్పులను గౌరవించాలని వాదించారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన ఒక ప్రసంగాన్ని ఇండిపెండెంటు సభ్యుడు శ్రీ చంద్రశేఖర్ ప్రస్తావించారు.

ప్రతిపక్ష నాయకుడు శ్రీ భూపేష్ గుప్తా యిందుకు అభ్యంతరం చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి వ్యవహారణను చర్చకు తేవటం గానీ, అయనకు ఉద్దేశాలను ఆపాదించటంగానీ కూడదన్నారు.

కేరళ కేబుల్ ఫ్యాక్టరీ త్వరలో ఉత్పత్తి ప్రారంభం

ఎర్నాకుళం, అక్టోబరు 3

ఇక్కడకు పదిమైళ్ళలో గల ఇనందానం గ్రామంవద్ద రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో నెలకొల్పబడిన కేబుల్ యంత్ర పరికరాల కర్మాగారంలో ఈ నెలాఖరులోగా ఉత్పత్తి ప్రారంభించ జరపవచ్చునని భావిస్తున్నట్లు ఇక్కడ అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి జన్మదినోత్సవ సందర్భంలో ప్రస్తుతం గుజరాత్‌లో పర్యటిస్తున్న జకీర్ హుస్సేన్ ఉపరాష్ట్రపతి అభినందన సందేశం పంపారు.

కాశ్మీర్‌లో రాష్ట్రపతిపాలన కావాలని బక్షీముఠా వింతకోర్కె

మురార్జీ అనుయాయుల మద్దతు

న్యూఢిల్లీ అక్టోబరు 3

కాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనకొరకు బక్షి దళంతో బక్షీ గులామ్ మహమ్మద్ అనుయాయులు రాజధాని నగరంలో పనిచేస్తున్నట్లు వెల్లడౌతున్నది.

ఢిల్లీలో బక్షి అనుయాయుల ముఠాలో బక్షి సోదరుడు బక్షి అబ్దుల్ రషీద్ మరి కొంతమంది కాశ్మీర్ రాజకీయ నాయకులు ఉన్నారు. బక్షి రషీద్ కేంద్ర ప్రభుత్వంలో గతంలో మంత్రిగాకూడా వ్యవహరించారు

బక్షికి అనుకూలంగా కాశ్మీర్ వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యంకలించుకోవాలని శ్రీ మొరార్జీదేశాయికి అతి సన్నిహితులుగా పరిగణింపబడే కొందరు రాజకీయ నాయకులు కూడా కోరుతున్నట్లు తెలుస్తున్నది.

బక్షిని దేశరక్షణ చట్టంక్రింద అరెస్టు చేయటాన్నిబట్టి బక్షిపై అతని అనుచరులపై కాశ్మీర్ ప్రభుత్వం పెట్టిన కేసు బలహీనమైందిగా తెలుస్తున్నదని వీరి ప్రధానమైన వాదన. బక్షి ప్రతిపాదింపనున్న అవిశ్వాస తీర్మానాన్ని కాశ్మీర్ శాసనసభలో అత్యధిక సంఖ్యాకులు బలపరచనున్నారని అందువల్ల సాదిక్ ప్రభుత్వ పతనాన్ని నిరోధించేందుకు ఈ అరెస్టులు జరిపారని వీరి వాదన

అయితే కాశ్మీర్ హోం మంత్రి శ్రీ డి.పి. దార్ ఇటీవల ఢిల్లీ వచ్చి అధికారులను అనధికారులను కలిసికొని కాశ్మీర్ ప్రభుత్వ చర్య ఏ విధంగా సక్రమమైనదో వివరించటంతో బక్షి ముఠాకుగొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది కాశ్మీర్‌లోని భారత వ్యతిరేకవర్గాలతో చేతులు కలిపి బక్షి ఏ విధంగా కాశ్మీర్‌లో అరాజకాన్ని సృష్టించటానికి ప్రయత్నించాడో కాశ్మీరు హోం మంత్రి ఢిల్లీవర్గాలకు వివరించిచెప్పారు.

బక్షి విడుదలకు ఢిల్లీ వర్గాలు సుముఖత ప్రదర్శించకపోవటంతో, ఈ బక్షిముఠా క్రొత్త మార్గాన్ని చేపట్టింది. కాశ్మీర్ శాసనసభలో మెజారిటీ సభ్యులు సాదిక్ ప్రభుత్వాన్ని బలపరచ నిరాకరిస్తున్నారని, కనుక రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలనను ఏర్పాటు చేయాలని వీరు వాదిస్తున్నారు. కేరళ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టగాలేనిది కాశ్మీర్‌లో ఎందుకు ప్రవేశ పెట్టగూడదు ? ఇదీ వారి వాదన సారాంశం.

కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితి కొనసాగుతూ ఉన్నందువలన, సాదిక్ ప్రభుత్వంపై అవిశ్వాసాన్ని శాసనసభ ప్రకటించని కారణంగా రాష్ట్రంలో ఎట్టి ఆందోళనా పరిస్థితి లేదు గనుక కాశ్మీరు వ్యవహారాల్లో కేంద్రం జోక్యం కలిగించుకోజాలదని ప్రధాని శాస్త్రి, హోంమంత్రి శ్రీ నందాలు స్పష్టం చేశారు. త్వరలో శాసనసభను సమావేశపరచి, సాదిక్ ప్రభుత్వాన్ని మెజారిటీ సభ్యులు బలపరుస్తున్న విషయాన్ని దేశప్రజలకు బహిరంగపరచవలసిందిగా ప్రధాని శాస్త్రి, శ్రీ నందాలు తమ అభిప్రాయాన్ని శ్రీ డి. పి. దార్ ద్వారా తెలియజేశారు.

'చైనా అటంబాంబు ప్రేల్చలేదు'

లోక్‌సభలో శ్రీనందా ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 3

పరదేశంలో కొన్ని పత్రికలు వ్రాస్తున్నట్లు చైనావారు అప్పుడే అణుబాంబు పరీక్ష జరిపి వుంటారని అనుకోవటానికి ఆధారాలేమీలేవని కేంద్ర హోంమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా యీ రోజు లోక్‌సభలో చెప్పారు.

అణుబాంబును ప్రేల్చటంలో చైనా గనుక సఫలతపొంది వుంటే అది ప్రపంచానికి వెల్లడికాకుండా వుండజాలదు.

అమెరికా, రష్యా, ఫ్రాన్సు, జపాన్‌లతో బాటు మన దేశంలో కూడా ఆ విషయం తెలిసిపోయే వుండేది. అది యెంతటి శక్తివంతమైన అస్త్రమైనదీ అది ఎక్కడ పరీక్షించబడిందీ కూడా తెలిసిపోయే వుండేది అని అయన అన్నారు.

అంతకుముందు శ్రీమతి తారకేశ్వరిసిన్హా పత్రికల్లో పడిన యీ వార్తను ప్రస్తావించి, ప్రధాని విదేశాంగ మంత్రి ఉభయులూ విదేశాల్లో వున్న సందర్భంలో ఇలాంటి వార్త రావడంతల్లో దేశ ప్రజల్లో సహజంగానే ఆందోళన యేర్పడిందనీ, అందువల్ల ప్రభుత్వం దేశ ప్రజలకు విశ్వాసంపుంచి వాస్తవమేమో తెలియజెప్పాలని కోరారు.

యస్. యస్. పి. కార్యకర్తల విడుదల

అల్లాహాబాద్, అక్టోబరు 3

"గాంధీ జయంతి" సందర్భమున సంయుక్త సోషలిస్టుపార్టీకి చెందిన 7 గురు కార్యకర్తలను నైని సెంట్రల్ జైలు నుండి ఈ వేళ ముఖ్యమంత్రి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది.

సెప్టెంబరు 25 వ తేదీన ఆహార పదార్థాల అధిక ధరలకు వ్యతిరేకంగా భారత దేశంలోటా జరిగిన హర్తాళ్ సందర్భంలో వీరిని ప్రభుత్వం అరెస్టు చేసింది.

'నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆటంకంలేదు'

శ్రీ కె. యల్. రావు ప్రకటన

హైదరాబాద్ అక్టోబరు 3

విజయపురి వంతెన 15 ఖానాలు కొట్టుకొని పోయి వంతెన ప్రస్తుతానికి నిరుపయోగమైనంత మాత్రాన ప్రాజెక్టు నిర్మాణానికి ఆటంకం ఏమీ ఉండదని,నిర్మాణ కార్యక్రమం యథాప్రకారం సాగిపోతుందని ఎడమ కుడి వైపుల ప్రాజెక్టు పని అప్పుడే యథా ప్రకారం సాగిపోతూందని కేంద్ర జలవిద్యుత్ మంత్రి శ్రీ కె ఎల్ రావు అన్నారు. (ఈ వార్త అందినవరకు నిన్న ఇచ్చాం—సం.)

నిన్న శ్రీ కె. ఎల్. రావు నాగార్జునసాగర్‌ను స్వయంగా పరిశీలించి వచ్చారు ఎడమవైపు ప్రాజెక్టుకు సిమెంటు సరఫరా ఒక్కటే సమస్య అనీ, ఇప్పుడు మాచెర్ల సిమెంటు ఫ్యాక్టరీ వరద దెబ్బకు గురై ఉంది కనుక అక్కడ ఉత్పత్తి నిలిచిపోయిందనీ అన్నారు. అందుచే హైదరాబాద్ నుండి ఎడమగట్టుకు సిమెంటు సరఫరా ఏర్పాటు చేయబడిందనీ, ఇక్కడకు రోజుకు 800 టన్నులు అవసరమనీ అన్నారు.

డామ్ నిరపాయ స్థితి

నిర్మాణంలో ఉన్న నాగార్జునసాగర్ డామ్ నిరపాయ స్థితిలో ఉండటం చాలా సంతృప్తి పడవలసిన విషయమని శ్రీ రావు అన్నారు ఇదివరకు ఎన్నడూ లేనంత ఎక్కువ ప్రవాహంను తట్టుకొని నిలబడటం విశేషమని అన్నారు

డామును కుడి, ఎడమల నుండి అటు యిటు నిర్మించుకొని వస్తుండటంతో అరమైలు వెడల్పు ఉన్న నదిలో ప్రవహించే నీరు యిప్పుడు 720 అడుగుల యిరుకు మార్గంగుండా ప్రవహించటంతో ఒక సొరంగంగుండా ప్రవహించే నీటివలె బ్రహ్మాండమైన వేగం, ఒత్తిడితో ప్రవహించిందనీ ఈ వత్తిడికి వంతెన తట్టుకొనలేక పోయిందనీ అన్నారు.

కావేరీనదిపై డామ్ నిర్మించే టప్పుడుకూడా ఇటువంటి దుర్ఘటనే జరిగిందనీ, కావేరీ నది ప్రవాహవేగం సెకండుకు లక్ష క్యూసెక్స్ ఉంటే వరద వచ్చినప్పుడు 5 లక్షల క్యూసెక్కులకు పెరిగిందనీ అందువలన అక్కడ కూడా ఇదేవిధంగా వంతెన కొట్టుకొని పోయింది అన్నారు.

అయినప్పటికీ విజయపురి వంతెన కొట్టుకొని పోవడానికి గల కారణాలను పరిశీలించడానికి ఒక సాంకేతిక కమిటీని నియమించవలసిందిగా తాను సూచించాననీ అన్నారు.

కృష్ణానది మామూలు ప్రవాహం 5 లక్షల క్యూసెక్కులనీ, వంతెన 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహ వేగాన్ని తట్టుకోవటానికి వీలుగా నిర్మింపబడిందనీ, కాని ఈ ఏడాది 12 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహించడం, అది కూడా ఇరుకైన 720 అడుగుల మార్గంగుండా అతివేగంగా ప్రవహించటంవలన ఈ దుర్ఘటన జరిగిందన్నారు. వంతెనలో మిగిలిన 18 ఖానాలు దృఢంగానే ఉన్నాయని అన్నారు

మిగిలిన ఖానాలు కూడా కూలిపోతున్నాయనే వార్తలను గురించి వ్యాఖ్యానించుతూ అడుగున ప్రవహించుతున్న నీటివల్ల వంతెన కదులుతున్నట్లు అనిపిస్తుందనీ అది దృష్టి భ్రమ" అనీ అన్నారు.

ప్రాజెక్టునకు ఆటంకంకల్గునుండునే ఆందోళనకు అవకాశం లేదనీ తాను స్వయంగా ప్రాజెక్టును పరిశీలించి వచ్చిన తరువాత ఈ విషయం తెలుపుతున్నాననీ అన్నారు.

మహబూబ్ నగర్ పరిస్థితి

మహబూబ్ నగర్ జిల్లా వరద ప్రాంతాలను నిన్న విమానంపై తాను చూశాననీ అక్కడి వరద పరిస్థితి మెరుగు అవుతూందనీ దిండి ప్రాజెక్టుకు ఎట్టి ప్రమాదం లేదనీ అన్నారు. సరళా సాగర్ డామ్‌కు కూడా ఎలాంటిప్రమాదం లేదని అన్నారు.

కొల్లేరు ఎర్రకాల్వ ఉప్పుటేరు ప్రాంతాలను తిరిగి రేపు విమానంపై తాను పరిశీలింపబోతున్నాననీ, కేంద్ర మంత్రి శ్రీ సంజీవరెడ్డి కూడా తనతో వస్తున్నారనీ అయన చెప్పారు.

మాస్కో మీదుగా ఢిల్లీ-లండన్ విమాన సర్వీసు ప్రారంభం

లండన్, అక్టోబర్ 3

ఎర్ ఇండియా బోయింగ్ - 707 జెట్ విమానం ఒకటి యీరోజు ఇక్కడనుండి మాస్కోమీదుగా ఢిల్లీ బయలుదేరింది.

ఈ మార్గంపై నిన్న ఢిల్లీనుండి బయలుదేరిన మొదటి విమానం మాస్కో సమీపంలో షెర్మిటోవ్ విమానాశ్రయంలో 50 నిముషాలసేపు ఆగింది.

మాస్కో మీదుగా ఢిల్లీ-లండన్‌ల మధ్య యీ విమాన ప్రయాణానికి 11 గంటలు మాత్రం పడుతుంది. ఈ సర్వీసు వారానికిరెండు సార్లు నడుస్తుంది.

ఢిల్లీ నుండి బయలుదేరే యీ సర్వీసులో మాస్కో నుండి లండన్ వెళ్ళేప్రయాణీకులను కూడా తీసుకుంటాను తమ విమాన సర్వీసులకు యిందువల్ల నష్టం వస్తుందని బ్రిటిష్ వర్గాలు అభ్యంతరం చెబుతున్నట్లు నిన్న మాస్కోలో వెల్లడైంది.

ఏర్ ఇండియా కంపెనీ అధికార వర్గాలు యీ అభ్యంతరాన్ని నిరాకరిస్తున్నవి. కరాచీ మీదుగా లండన్ వెళ్ళే పాకిస్తాన్ విమాన సర్వీసులకు లేని యీ అభ్యంతరాన్ని బ్రిటన్ మన దేశం విషయంలో మాత్రం లేవనెత్తడం వివక్ష అని వారు విమర్శిస్తున్నారు.

మైసూరులో అక్టోబర్ 6 నుండి దసరా ఉత్సవాల ప్రారంభం జరుగును

విజయవాడలో వరదబాధితులకు సహాయం ఏర్పాట్లు

శ్రీ చలసాని వెంకటరత్నం సూచనలు

విజయవాడ, అక్టోబరు 4

కృష్ణలంక కమ్యూనిస్టుశాఖ కార్యదర్శి, మునిసిపల్ కౌన్సిలర్ శ్రీ చలసాని వెంకటరత్నంగారిలా ప్రకటిస్తున్నారు:

వరద ప్రమాదానికి గురైన విజయవాడ ప్రజలు మునిసిపల్ హైస్కూలు, ఎలిమెంటరీ స్కూళ్లలో తల దాచుకుంటున్నారు. ఆ దురో హెచ్చుమంది ఏరోజు కూలి ఆ రోజు చేసుకుని జీవించే పేద ప్రజలు వీరికి అధికారులు సప్లయి చేస్తున్న బియ్యం సక్రమంగా పంపిణీ కానందువల్ల కొంతమంది పస్తు పడుకోవలసి వస్తున్నది కొన్ని స్కూళ్ళలో పూర్తిగా ఇప్పటివరకు బియ్యం ఇవ్వని సందర్భాలు కూడా వున్నాయి ఎస్ కె పి వి హిందూ హైస్కూలు (గాంధీనగర్), మాచవరం టాకీసు వద్ద వున్న కాన్వెంటు స్కూలు దగ్గరాలలో యీ నాటివరకు బియ్యం ఇవ్వలేదు అలాగే గాంధీజీ మునిసిపల్ హైస్కూలులో బియ్యం అందనివారు చాలా మంది వున్నారు. కృష్ణలంక కరకట్టపై తలదాచుకుంటున్న ప్రజలకుకూడా బియ్యం ఇవ్వటానికి అధికారులు నిరాకరిస్తున్నారు ఫలితంగా పై ప్రాంతాలలోని ప్రజలు పస్తులు పడి వుండవలసిన దుస్థితి ఏర్పడుతున్నది. వందలకొలది కుటుంబాలు ఒకేచోట వుండవలసిరావటం, త్రాగే నీటి వసతి లేకపోవటంవల్ల అవి యివి తిని కడుపు నింపుకునే ప్రయత్నం చేయటంవల్ల శానిటేషన్ సక్రమంగా లేనందువల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. గత రాత్రి గాంధీజీ మునిసిపల్ హైస్కూలులో వాంతులు విరేచనాలతో 10 సంవత్సరాల బాలుడు మరణించాడు పొన్నకరరావుపేట కట్టపైన ఇదేపరిస్థితులలో మరొకరుమరణించారు అని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు గాంధీజీ మునిసిపల్ హైస్కూలులోని పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది వందలకొలది కుటుంబాలు వరండాల్లోనే ఉండవలసివస్తున్నది. వర్షం కురిస్తే దాగి పడుకునే అవకాశంకూడాలేదు. రూములు ఉన్నప్పటికీ తాళాలువేసివున్నాయి. ఆ రూములను వరదబాధితులకు ఇవ్వడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. అంతేకాక సోమవారమే స్కూల్సు ఖాళీచేయాలని స్కూల్సులవద్ద బోర్డులు కట్టబడ్డాయి, అంతవరకు ఇళ్ళలోని నీరు తగ్గలేదు యీ పరిస్థితులలో స్కూల్సు ఖాళీచేసి ఎక్కడికి వెళ్ళాలో తెలియని అయోమయ పరిస్థితిలో ప్రజలు న్నారు. కనీసం మరొక వారం రోజులుపుంటే తప్ప తిరిగి వారి ఇండ్లలోనికి ప్రజలువెళ్ళే అవకాశం వుండదు, కనుక అధికారులు వెంటనే యీ క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను:

1. స్కూల్సులోనే కాక ఇతర ప్రాంతాలలో తలదాచుకుంటున్న వరద బాధితులకు కూడా దిన భత్యం అందేలా చూడాలి.
2. అన్ని స్కూల్సులోవున్న వారికి సక్రమంగా బియ్యం అందే ఏర్పాటు చెయ్యాలి
3. మరొకవారం రోజుల పాటైనా సహాయ కార్యక్రమాన్ని కొనసాగించాలి
4. వెంటనే పల్లపుప్రాంతాలలో నిల్వవున్న నీటిని తోడించే ఏర్పాటు చెయ్యాలి.
5. తమ ఇళ్లను గోడలను పునర్నిర్మించుకొనుటకు తగు ఆర్థిక సహాయం వెంటనే ఏర్పాటు చేయాలి.
6. అన్ని స్కూల్సులోను శానిటేషన్ సక్రమంగా వుండేలా చూడాలి. తగు వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

'బుడమేటి వరద నివారణ కరకట్టల వల్లనే కాదు'

మొన్నటి నష్టాలపై వెలగలేరు సర్పంచ్ వివరణ

వెలగలేరు, అక్టోబరు 4

కృష్ణాజిల్లా వెలగలేరు పంచాయతీ సర్పంచ్ శ్రీ సి. హెచ్. వెంకటరావుగారిలా వ్రాస్తున్నారు:

'సెప్టెంబరు 27 28 తేదీలలో కురిసిన విపరీత వర్షములకు బుడమేరు వరద బ్రహ్మాండముగా వచ్చి దాని సమీపంలోని గ్రామములు కంచికామ, కోడూరు, కుంటముక్కల, శీవరప్పాడు, సీతారామపురం, వెల్లటూరు, ముళ్ళపాడు, కంచులపాడు, వేదిరెడ్డిపాడు, కవులూరు, వెలగలేరు, జూపూడి, పైడూరపాడు, రాయనపాడు, జాదేపల్లి, కొత్తూరు, జక్కంపూడి, షాబాద్ మొదలగు గ్రామములకు నష్టము ఎంతో యింతవరకు అంచనా లేదు అందిన వార్తనుబట్టి సుమారు 2000 వరకు గృహములున్నూ, 100 పశువులు నష్ట పోయినట్లు తెలిసింది.

ప్రభుత్వంవారు తలపెట్టిన బుడమేరు వరద నివారణకు కరకట్టలు పోయింది ఈ గ్రామములు వరదపాలు చేశారు, గతసంవత్సరమున్ను ఈ సంవత్సరమున్ను ఈ కట్టలవల్ల ప్రజానీకమునకు జరిగిన నష్టకష్టములవల్ల ప్రభుత్వంశ్రద్ధ వహించలేదు

బుడమేరు డైవర్షన్‌వల్ల బుడమేరు వరదలను ఎట్టి పరిస్థితులలోను ఆపలేమని యీ సంవత్సరము వచ్చిన వరదలే నిదర్శనము. కావున వరద బుడమేరుకు పైభాగమున రిజర్వాయరున్నూ, ఇరుప్రక్కల కట్టలున్నూ ఏర్పాటు చేయించి తెగ్గుతేలు వద్దనుండి కృష్ణకు మళ్ళింపు కాల్వ మరియొకటి ఏర్పాటు చేసినచో తప్పకబుడమేరు వరదలను అరికట్టుటకు అవకాశము కలుగగలదని మనవి చేయుచున్నాను.

ఆంధ్రలో వరద నష్టాలకు యూథాంట్ సంతాపం

న్యూఢిల్లీ అక్టోబరు 3

ఆంధ్రప్రదేశ్‌లో వరద నష్టాలకు సంతాపం తెలియజేస్తూ ఐరాస ప్రధాన కార్యదర్శి శ్రీ యూథాంట్ భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్‌కు ఒక సందేశం పంపారు.

"మాచెర్ల వరదలో విపరీత జననష్టం కలిగినదని విని చాలా చేద పడుతున్నాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక సంతాపాన్ని తెలుపండి.

జనవరినాటినుంచి 187 చోట్ల సోదాలు

పరిశ్రమోద్యోగుల అవినీతి సందర్భంగా

న్యూఢిల్లీ అక్టోబరు 3

రాజ్యసభలో నేడు ఒక ప్రశ్నకు సమాధానంగా జనవరినుండి నేటివరకుమోసం,దగా ఫోర్జరీ దొంగసర్టిఫికెట్ల కేసులలో 81 కేసులలో 187 చోట్ల సోదాలు జరిగాయని హోంశాఖ సహాయమంత్రి శ్రీ జైసుఖ్‌లాల్‌హాథీ చెప్పారు కంపెనీలలో లాభార్జీ అయి పెద్ద పుద్యోగులు చేసిన అక్రమ్యాలకు సంబంధించినవి ఈ కేసులని ఆయన చెప్పారు.

వ్యాపారసంస్థల కార్యాలయాలూ ఆకంపెనీ డైరెక్టర్ల, భాగస్థుల, పుద్యోగుల ఇళ్లనూ, ప్రభుత్వోద్యోగుల ఇళ్లనూ సోదా చేశారనీ ఆ కేసులలో ఏడింటిలో కేసులు పెట్టడమో ఆ యా శాఖల ద్వారా చర్యలకు సిఫార్సు చేయటమో జరిగిందని అన్నారు.

ఆయా కంపెనీల డైరెక్టర్లు, వారి పుద్యోగులూ ఈ మోసకృత్యాలతో సంబంధం కలిగి వున్నారని పత్రాల ఋజువు దొరికినచోట వారిమీద కేసు లేల పెట్టరన్న ప్రశ్నకు శ్రీ హాథీ సమాధానం ఇస్తూ అటువంటి సందర్భాలలో ఆరోపణలకు అంతిమరూపం ఇవ్వడం జరుగుతూం దన్నారు.

శ్రీ ధర్మరావుగారికి సన్మానం

(1 వ పేజీ తరువాయి)

పాత గాంధీజీ బోధలను దేశం ఎంతదూరమవుతూందో వివరించారు గాంధీజీయే బ్రతికి ఉంటే అవినీతికి వ్యతిరేకంగా నేడు సత్యాగ్రహం, నిరాహారదీక్ష జరిపి ఉండేవారన్నారు, విదేశాలకు వెళితే "గాంధీజీ దేశస్థులు, నెహ్రూ దేశస్థులు"ని భారతీయులను గౌరవించడం గురించి ప్రస్తావించి, "వారికి హిమాలయాల్లోని ఎవరెస్టులాంటి ఎత్తయిన శిఖరాలు తెలుసేగాని ఆ కొండచరియల్లో పులులు పిల్లులు మొదలయిన క్రూరమృగాలు కూడా ఉన్నవని ఏమితెలుసు"నని అన్నారు.

ఈ కష్టాను కడిగివేయడానికి గాంధీజీ మార్గాన్ని తిరిగి దీక్షతో ప్రచారం చేయాలన్నారు.

శ్రీ తుమ్మల సత్యనారాయణమూర్తిగారు ప్రసంగిస్తూ, నేడు నాయకులుకూడా గాంధీ పేరును ఉపయోగించి పబ్బం గడుపుకొంటున్నారనీ, ఈవిధంగా పోతే, దేశానికి ఉజ్వల భవిష్యత్తు లేదని అన్నారు

ఈ సందర్భంలో ఏర్పాటుచేసిన నాటక పోటీలను శ్రీ పసల సూర్యచంద్రరావుగారు ప్రారంభోత్సవం చేస్తూ గాంధీజీ బోధలను ప్రజలకు అందించేవిగా, ఈ సందర్భంలో ప్రదర్శించే నాటకాలు, నాటకాలు ఉండడం మంచిదన్నారు.

పార్లమెంటు వాయిదా

న్యూఢిల్లీ అక్టోబరు 3

లోక్‌సభ నేటితో కాల నిర్ణయం లేకుండా వాయిదా పడింది

రాజకీయ పక్షాలకు కంపెనీలు విరాళాలు ఇవ్వడాన్ని నిషేధించాలనే శ్రీ వాజపేయి బిల్లుపై చర్చ పూర్తికాకుండానే రాజ్యసభ కూడా నేడు వాయిదా పడింది

'వరదబాధిత విద్యార్థులకు బడిజీతాల రెమిషన్ ఇవ్వాలి'

ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ డిమాండ్

విజయవాడ అక్టోబర్ 3

వరద ప్రమాదానికి గురై, నష్టపడిన ప్రాంతాలలోని విద్యార్థులందరికీ, బడిజీతాల రెమిషన్‌ను ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఇక్కడ జరిగిన ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం తీర్మానించింది.

ఆ తీర్మానంలో ఇలావుంది:

"ఈ మధ్య దేశంలోనూ అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనూ అతివృష్టివల్ల అశేష ప్రజానీకం వరద ప్రమాదాలకు గురయ్యారు. వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. కోట్ల కొలదిరూపాయల ఆస్తులు నష్టమయ్యాయి ఈ దారుణసంఘటన సందర్భంలో అసువులుబాసిన వారికి సంతాపం ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం తెలియజేస్తున్నది. వరదలకు గురయిన విద్యార్థులకు జీతాలు తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది

వరద బాధిత ప్రజలకు ప్రభుత్వం వెంటనే తగు సహాయం అందజేయాలని, విద్యార్థులు, విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలుకూడా వివిధ రూపాలలో ఆయా వరదబాధితులకు విరాళాలు పంపాలని తీర్మానించింది.

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం 30-9-64 వ తేదీన విజయవాడ, సీతారాంపురంలో సంస్థ అధ్యక్షులు శ్రీ సి. రాఘవాచారిగారి అధ్యక్షతన జరిగింది. వరదలవల్ల ప్రయాణ సౌకర్యాలు ఆగిపోయి ఇప్పటికీ సభ్యులు అన్ని బాధలకు ఓర్చి సమావేశానికి సకాలంలో అందుకున్నారు.

సమావేశం సుదీర్ఘమైన చర్చల అనంతరం యీ దిగువ తీర్మానాలను, నిర్ణయాలను ఏకగ్రీవంగా అంగీకరించింది:

1. విద్యార్థి యూనియన్ ఎన్నికల సందర్భంలో మొదటి టరమ్‌లోపూర్తి కాని విద్యార్థి ఫెడరేషన్ సభ్యత్వా సేకరణను అక్టోబరు మొదటి భాగములో పూర్తిచేయాలి.

2. ఆంధ్రప్రదేశ్‌లోని 3 విశ్వవిద్యాలయాలలోను యీ సంవత్సరంనుండి డిగ్రీకోర్సులో డిటెన్షన్ విధానం అమలులోనికి వచ్చింది. బ్రిటిష సామ్రాజ్యవాదుల కాలంలో భారత విద్యార్థుల పుణ్యాల పోరాటంవల్ల రద్దుచేయబడ్డ యీ డిటెన్షన్ విధానం మరల స్వతంత్ర భారతావనిలో ప్రవేశపెట్టటం శోచనీయమైన విషయం.

దీనిపై గతసంవత్సరం ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలలో కొంతఆందోళన జరిగింది. దీనిపై శ్రీ వెంకటేశ్వరలో ఈ సంవత్సరానికి విద్యార్థులకు ఎగ్జంప్షన్ యిచ్చారు. ఆంధ్రలో ఏ సదుపాయంలేదు. మరల ఉస్మానియా విశ్వవిద్యాలయం లోకూడా ఈ సంవత్సరం డిటెన్షన్ను ప్రారంభించారు. కాబట్టి యిలాంటి అభివృద్ధి నిరోధకమైన పద్ధతిని విరమింపచేసేందుకు ఐక్యవిద్యార్థి ఆందోళన ఒక్కటే మార్గం. ఈ రెండవ టరమ్‌లోనే ఆందోళనా కార్యక్రమాన్ని తీసుకోవలసివుంది ఇలాటి ఐక్యవిద్యార్థి ఆందోళనా కార్యక్రమం జయప్రదం కావానికి దోహదంగా ఈ సమస్యా పరిష్కారానికి కావలసిన మార్గాలను పరిశీలించి ప్రయత్నించవలసిందిగా ఆంధ్ర ప్రదేశ్‌లోని ఇతర విద్యార్థి సంఘాలకు, రాజకీయ సంస్థలకూ, విద్యార్థి యూనియన్లకూ విజ్ఞప్తిచేస్తూ తీర్మానించింది.

3. గత విద్యార్థి యూనియన్ ఎన్నికల సమీక్షను పరిశీలించి విద్యాధికార్లు దిన దినం విద్యార్థులలో ఐక్యతా విచ్ఛిన్నతకి దోహదం చేయడానికి విద్యాలయాలలో విద్యార్థి యూనియన్లను రద్దు చేయటం ప్రజాస్వామిక ఎన్నికలను మార్పు చేయడంలాంటి చర్యలకు పూనుకొన్నారు. ఇట్టి చర్యలను నిరసిస్తూ, అన్ని విద్యాలయాలలో ప్రజాస్వామిక ఎన్నికలు జరపాలని, అలానే విశ్వవిద్యాలయ యూనియన్లను ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానించింది

4. సెప్టెంబరు 25 వ తేదీన దేశవ్యాపిత హర్తాళ్ సందర్భంలో హైదరాబాద్‌లో యీ కార్యక్రమంలో పాల్గొన్న హైస్కూలు విద్యార్థులపై బెత్తాలను ఉపయోగించి దౌర్జన్యానికి పాల్పడిన పోలీసుల చర్యను తీవ్రంగా నిరసిస్తూ తీర్మానించింది.

5. భారత దేశంలో మైసూరు, నాగపూరు, ఉత్కళ్ లాంటి వివిధ విద్యాలయాలలోనూ, మన రాష్ట్రంలో ఒంగోలు కాలేజీలోనూ జీతాలు పెంపటానికి వ్యతిరేకంగా, వివిధ విద్యార్థి సమస్యలపైన విద్యార్థులు చేస్తున్న సమ్మెలలాంటి ఐక్యాందోళనాకార్యక్రమాలకు సానుభూతి సహకారాలను అందజేస్తూ తీర్మానించింది.

6. భారతదేశం మొత్తంగా యీ మధ్యకాలంలో ఆహార పదార్థాల ధరలు పెరిగిపోయి ప్రజలు, విద్యార్థుల జీవిత పరిస్థితి దుర్భరంగా తయారుకావటం, దానిపై దేశం మొత్తంగా ప్రజలు వివిధ రూపాలలో ఆందోళన చేయటం సర్వవిదితమే కాని యీ సమస్యను ప్రభుత్వం నేటికీ పరిష్కరించలేకపోవటం శోచనీయం. ప్రభుత్వం వెంటనే ఆహార పదార్థాలను ప్రజలకు సరసమైన ధరలకు అందజేయవలసిందిగా కోరుతూ తీర్మానించింది

7. సెప్టెంబరు 18 వ తేదీ నుండి 26 వ తేదీవరకు మాస్కోలో అంతర్జాతీయ యువజన విద్యార్థి సంఘాల అధ్వర్యాన ఒక గోష్ఠి నిర్వహింపబడటం సర్వవిదితమే ఈ గోష్ఠిలో భారతదేశంలోని వివిధ విద్యార్థి, యువజన సంఘాలు ఐక్య ప్రతినిధివర్గాన్ని పంపగలిగి నందుకు అభినందించారు. అలానే అనేక విచ్ఛిన్నకర ప్రయత్నాలను వమ్ముచేసి, విశ్వశాంతి సుస్థిరతను, వెనుక బడిన దేశాల అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని యీ గోష్ఠి అంగీకరించిన తీర్మానాలను యీ సమావేశం అభినందించింది.

ఈ సందర్భంలోనే నేడుకూడా సామ్రాజ్యవాదుల-ఉత్తర వియత్నాంపై అమెరికా దాడి, సైప్రస్‌పై టర్కీదాడి, అమెరికా మరల అణ్వస్త్ర పరీక్షలు ప్రారంభించాలనటం లాంటి చర్యలను ఖండిస్తూ తీర్మానించింది.

8. ఈ కేంద్రప్రభుత్వం విద్యకు ప్రణాళికలో కేటాయించవలసినధనం విషయం ఆలోచించేందుకై నియమించిన ఖేర్ కమిటీ కేంద్రంలోకనీసం 10శాతం, రాష్ట్రప్రభుత్వాలు 20 శాతం కేటాయించాలని సిఫారసుచేశారు. ఐనప్పటికీ నేటికీ కేంద్ర ప్రభుత్వం ఏ ప్రణాళికలోనూ 5 శాతం మించి ధనం నేటివరకు కేటాయించలేదు నేడు 4 వ ప్రణాళిక తయారుకు ప్రాథమిక ప్రారంభం కావటం సర్వవిదితమే. ఈ సందర్భంలో 4వ ప్రణాళికలో కనీసం విద్యకు 10 శాతానికి తగ్గకుండా ప్రభుత్వం కేటాయించాలని కోరుతూ తీర్మానించింది

9. ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థుల ముఖ్యమైన సమస్యలపైన,విద్యార్థులలో సంతకాలు సేకరించి, ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించాలని నిర్ణయించింది.

పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ రామకిషన్, మాజీముఖ్యమంత్రి శ్రీ ప్రతాప్‌సింగ్ ఖైరాన్‌ను కలుసుకొని శాసనసభ సభ్యత్వానికి రాజీనామా ఇవ్వవలసినదిగా కోరారు.

మాచెర్ల వరద బాధితులకు సహాయం

రాజమండ్రి, అక్టోబరు 3

గుంటూరుజిల్లా మాచెర్లలో ఇటీవల జరిగిన ఘోరమైన వరదలవల్లబాధలుపడినవారికి సహాయార్థం ఆర్థికంగాసహాయం పంపాలనికోరుతూ తూర్పు గోదావరి జిల్లా యువజన సంఘ కార్యదర్శి శ్రీ సుబ్బారావు వెల్లాలరావుగారు జిల్లా యువకులకు విజ్ఞప్తి చేశారు. "శ్రీ వి నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య, గుంటూరు" అనే అడ్రసుకు పంపాలని అయన సూచించారు.

పుంగనూరు తాలూకాలో గింజల కొరత

పుంగనూరు, అక్టోబరు 3

చిత్తూరుజిల్లా, పుంగనూరు తాలూకాలో ఈయేడు కొన్ని ప్రాంతములలో వర్షములు పడినవి. కానీ మెట్టపంటలకు సరైన అదను దొరకక చెడినవి. పుంగనూరు సమితిలో కొన్ని చెరువులు, కుంటలు తెగిపోయినవి, అందువలన రైతాంగం భీతిచెందినది.

కూలీలకు ప్రస్తుతం పనులన్నీ అయిపోయిననందున చాలామందికి పనులులేవు ఆహార ధాన్యముల కొరతకు తోడు అధిక ధరలు ప్రజలను చాలా ఇబ్బందులు పెట్టుచున్నవి.

పుంగనూరులో చౌకడిపోలవద్ద బియ్యము అందరికీ దొరకడంలేదు చాలామంది కాసుకొని ఆకలితో వాపసు పోవుచున్నారు. మార్కెట్టులో ఇతర నిత్యజీవితావసర వస్తువుల ధరలు విపరీతముగా పెరిగినవి.

ప్రస్తుతం ఈ తాలూకాకు చౌక డిపోలకు ఇస్తున్న బియ్యంకోటా యే మాత్రం చాలడం లేదు. రోగాల కరువు కాటకాలలో కూడా ఈ విధముగ ధరలు పెరగలేదని అందరూ ఆశ్చర్యపడి భయపడుచున్నారు (వి.వి)

గిద్దలూరులో గింజల కొరత

గిద్దలూరు, అక్టోబరు 3

కర్నూలు జిల్లా గిద్దలూరులో తహశీల్‌దారు పేరుకు 5 డిపోలు పెట్టించినారు కాని ఇంత వరకు సక్రమంగా బియ్యం పంచటం జరుగనే లేదు సెప్టెంబరు 29 వ తేదీన తాలూకా సప్లయి ఆఫీసరు కంభం నుండి 30 బస్తాల బియ్యం తెప్పించి అవి ఇంటికి 5 కిలోల ప్రకారం పంచమని ఉత్తర్వు చేసినారు. కాని అది కనీసం 4 వార్డుల ప్రజలకు కూడ సరిపోలేదు. సెప్టెంబరు 30 వ స్థానిక శాసన సభ్యులు శ్రీ బలరామిరెడ్డి, పట్టణ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ సంజీవరాయుడుగార్లు సప్లయి ఆఫీసరు దగ్గరకుపోయి విషయం తెలిపారు.



ఉత్తర దేశమంతా ప్రజలు, పత్రికల మన్ననలను పొంది సిల్వర్‌జూబిలీ జరుపుకొన్న

ప్రసాద్ ప్రొడక్షన్సువారి

బేటీ బేటే

శ్రీ సరోజాదేవి, సునీల్‌దత్, జమున, మహమూద్, [illegible]

ప్రొడ్యూసర్ డైరెక్టర్: ఎల్ వి. ప్రసాద్. మ్యూజిక్: శంకర్ జైకిషన్

ఈ దిగువ కేంద్రాలలో నేడే చూడండి:

శ్రీనివాస — విజయవాడ		శ్యామల — కాకినాడ	
వెంకటేశ్వర — గుంటూరు		విజయా — విశాఖపట్నం	
న్యూ టాకీ — నెల్లూరు		సాయిబాబా — కర్నూలు	
బృందావన్ — మచిలీపట్నం		కృష్ణా — కడప	
కృష్ణా — రాజమండ్రి		నవరంగ్ —పూర్ణా రిలీజ్	

రేడియో

మంగళవారం, అక్టోబరు 6

శక 1886 ★ ఆశ్వయుజ 14

విజయవాడ

357 1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు: 6-40 అం. వా: 6-45 వివావరణ కీర్తన 6-55 సూక్తిముక్తావళి 7-00 తె వా 7-15 చతురంగం 7-30 దేవీ కీర్తనలు 8-00 అం. వా: 8-15 ప్రాంజలి 8-30 మంచిరాజు సత్యనారాయణ మూర్తి 9-00 సమాప్తి

మధ్యాహ్నం: 12-30 హై రిలే 1-00 స్త్రీల కార్యక్రమం: 1-30 గానసుధ 1-40 హిం. వా 1-50 తె. వా: 2-00 సమాప్తి

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాం. వా 6-15 హై రిలే, 6-20 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7-00 తె వా 7-15 గ్రామస్థులకు: 7-30 పిల్మ్ సంగీతం: 7-45 హై రిలే, 8-00 మంచిరాజు సత్యనారాయణమూర్తి 8-30 శ్రోతల ఉత్తరాలకు జవాబులు: 8-45 లలిత సంగీతం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా. 9-15 ఆంగ్లమున 9-20 విరామ సంగీతం: 9-30 హై రిలే 10 00 వయొలిన్: 10 30 అం. వా: 10-35 వాతావరణ సూచన, సమాప్తి - జన గణ మన.

హైద్రాబాద్ - ఎ

405 4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరాలు: 6-40 అం. వా: 6-45 వి. రిలే: 6-55 సూక్తిముక్తావళి: 7-00 తె వా: 7-15 సంకీర్తనం: 7-30 మదుర మణిఅయ్యర్: 7 45 భయాల్: 8-0 అం. వా: 8-15 విజయవాడ వలె: 8-30 వి. వలె: 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు - కార్మిక చట్టాలు - నాడు నేడు - వరిదయ కార్యక్రమము: 1-00 వి. రిలే: 1-30 నాట్య గోష్ఠి: విలయ విద్వాంసులు: 1-40 హిం. వా: 1-50 తె వా: 2-00 భజాసింగ్ బృందం - భజన్: 2-10 ఉ వా: 2-20 రసూలన్‌బాయ్, 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశం: 6-20 హై. వి. వలె: 7-00 తె. వా: 7-15 హై వి. వలె 7-30 నగర శ్రోతలకు - మీ వని మీ కిష్టమా: గుమాస్తాగిరి: 7-45 రేడియో వార్తావాహిని: 8-00 మీరు కోరిన పాటలు: 8-30 హిందీ ప్రసంగం: 8-45 ఈ మానవు పాట: 8 50 విరామ సంగీతం: 8-55 ప్రస్తుతాంశము: 9-00 అం. వా: 9-15 ఉ వా: 9-30 విశ్వ విద్యాలయాలకు: 10-0 ఖయాల్ 10-30 అం. వా: 10-35 సమాప్తి - జన గణ మన.

హైదరాబాద్ - బి

కడప

365 1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322 6 మీ (930 కిలోసై)

సాయంత్రం 5-00 నుండి రాత్రి 9-30 వరకు

39 42 మీ (3355 కిలోసై)

(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై. ఎ. వలె: 7-45 సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై.)

8-00 హై. ఎ. వలె: 9-00 సమాప్తి.

42 02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నము: 12-30 హై ఎ. వలె: 2-10 వీణ 2-30 సమాప్తి

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు: 7-30 జానపదగేయాలు: 7-45 హై ఎ. వలె: 8-30 ఎమ్. ఎల్ వసంతకుమారి: 8-45 హై ఎ. వలె: 9-15 విశాన తరంగిణి మూకం కరోతి వాచాలం - రూపకం: 9-30 హై ఎ. వలె: 10-00 వీణ: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన.

మద్రాస్ - బి

211 3 మీ (1420 కిలోసై)

60 98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం. వా: 6-45 మ. వి. వలె: 7-00 తె. వా: 7-15 దీక్షితుల నవావరణ కృతి - విలయ విద్వాంసులు: 7-30 అద్వైతం - శ్రీరంగం వి. ఎస్ కృష్ణమూర్తి రాత్రి 8-00 అం. వా: 8-15 సమాప్తి.

మధ్యాహ్నం: 12-00 కార్మికులకు: 12-30 సమాప్తి.

1-00 భూమా కృష్ణస్వామి: 1-30 అం వా: 1-40 గీతమంజరి: 1-50 తె. వా: 2-00 సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం. వా: 6-05 మ ఎ వలె: 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్యవార్తలు (ఆంగ్లం): 6-30 కార్యక్రమ వివరణ - తమిళం: 6-35 ఎ. వి. బాలసుబ్రహ్మణ్యం: 7-00 తె. వా: 7-15 వాద్యగోష్ఠి: దేవీ కీర్తనలు: 7-30 నాటిక - తమిళం 7-45 ఎస్ కె రాజం - వీణ రిలే: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున: 9-30 సంగీతామృతం: 10-30 అం. వా: 10-35 సమాప్తి - జన గణ మన

ఐదవ ఉక్కు కర్మాగారంపై చర్చలు

న్యూఢిల్లీ అక్టోబరు 3

అయిదవ ఉక్కు కర్మాగార నిర్మాణ విషయమై నేడిక్కడ ఆంగ్లో - అమెరికన్ ఉమ్మడిసంస్థల ప్రతినిధుల, కేంద్రప్రభుత్వాల మధ్య చర్చలు ప్రారంభమైనాయి.

నేటి సాయంత్రం ఆంగ్లో - అమెరికన్ ఉమ్మడి సంస్థల ప్రతినిధులు కేంద్ర ఉక్కు గనుల మంత్రి శ్రీ యన్ సంజీవరెడ్డిని కల్సుకున్నారు ఈ చర్చలలో ఉక్కు గనుల ఉపమంత్రి శ్రీ ప్రకాశ చంద్రసేథి ఆ మము ఉక్కు శాఖ కార్యదర్శి శ్రీ యన్ యన్ వాంఛూలు కూడా పాల్గొన్నారు. ఆంగ్లో-అమెరికన్ ఉమ్మడిసంస్థల ప్రతినిధులకు ప్రెస్‌ఫోర్డ్ నాయకత్వం వహించారు

ఇంతకుముందే ఈ ప్రతినిధులకు హాస్పేట్, విశాఖపట్టణాలలో క్రొత్త ఉక్కు కర్మాగారాలను నిర్మించే అవకాశాలను గురించి నేలంపడ్డ ఉక్కుకర్మాగారం పథకాన్ని గురించి నివేదికలను అందజేయటం జరిగింది.

తొలి వార్త

ఆంగ్లో అమెరికన్ ఉక్కు కర్మాగారాల నిర్మాణసంస్థ ప్రతినిధివర్గం అమెరికాకు చెందిన వాన్స్ బ్రాండట్ నాయకత్వాన రేపు ఇక్కడికి రాబోతుంది.

ఈ కర్మాగారం నిర్మాణ విషయంలో సహాయాన్ని గురించి నిర్దిష్టమైన ప్రతిపాదన ఈ సంభాషణల సమయంలో జరగగలదనిభావిస్తున్నారు. నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలంలో నెలకొల్ప దలచిన ఈ కర్మాగారం ప్రారంభ దశలో పదింతల 50 వేల టన్నుల ఉత్పత్తి శక్తి కలిగి వుంటుంది.

ఈ నూతన కర్మాగారాన్ని నెలకొల్పడానికి కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ప్రతిపాదించిన రెండు ప్రాంతాలలో దేనినో ఒకదానిని నిర్ణయించు బాధ్యతను ఈ ఆంగ్లో అమెరికన్ కంపెనీలకే వదలివేశారు. దీనిపై ఈ కంపెనీలకు చెందిన ప్రవీణుల బృందం ఒకటి గోవా హాస్పెట్, బైలదిలా-విశాఖపట్నం ప్రాంతాలను దర్శించి పరిశీలించగలదని భావిస్తున్నారు. ఈ పరిశీలనకు సహాయకారిగా ఉండేందుకు ఈ ఉభయ ప్రాంతాలలో ఉక్కు కార్మాగారాల నిర్మాణానికిగల అవకాశాలపై భారతదేశం చేసిన పరిశీలనను వీరికి అందజేస్తారు. ఐదవ ఉక్కు కార్మాగార నిర్మాణానికి మిగిలిన ప్రాంతాలకంటే హాస్పేటకే ఎక్కువ అవకాశాలు గలవని ఇక్కడ పరిశీలన ఫలితంగా భావిస్తున్నారు.

ఈ నిర్మాణ విషయంలో సహాయానికి ఆంగ్లో-అమెరికన్ కంపెనీ షరతు లేమిటో ఇంకా స్పష్టం కాలేదు అయినా భారతదేశంలో ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణానికి పెట్టిన షరతుల విధంగానే ఇవీ ఉంటాయని వారు భావిస్తున్నారు ఎరువులఫ్యాక్టరీ నిర్మాణానికి అమెరికా కంపెనీ పెట్టినషరతులప్రకారం ఆ కంపెనీకి సహకారం వుంటుంది. అంటే మొత్తం విదేశీ పెట్టుబడి 40 శాతం, భారత ప్రభుత్వానికి 40 శాతం భారత ప్రయివేటు పెట్టుబడిని 20 శాతం వుంటుంది. బొకారా కర్మాగార నిర్మాణానికి కూడా ఒకే షరతులను విధించాయి. అయితే అప్పుడు భారత ప్రభుత్వం వాటిని నిరాకరించింది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని భారత ప్రభుత్వం ఉబలాట పడుతున్నందున, ప్రస్తుత పరిస్థితులలో ఈ షరతులను ప్రభుత్వం అంగీకరించవచ్చునని పశ్చిమ దేశాల వర్తక బృందం, దౌత్యవర్గాలు భావిస్తున్నారు.

కేంద్ర ఆహారశాఖ మాజీ సహాయ కార్యదర్శి శ్రీ మోహిందేంద్రదాస్, ఆయన పత్నిమణి క్రూరంగా హత్యకావించబడ్డారు. వారి శవాలను పోలీసులు కుక్కల సహాయంతో కనుగొన్నారని తెలుస్తున్నది.

సామాన్యులకు విజ్ఞాన శాస్త్రం

జంతు శాస్త్రము	రు. 2—12
మనకు వినబడని ధ్వనులు — శి ఐద్యావ్ స్కీవ్	0—50
అణుబాంబు ప్రేలుడు - ప్రపంచవ్యాపిత ప్రమాదం — ఎ యమ్ వాజన్	0—50
ఆధునిక వ్యవసాయ పద్ధతులు	1—00
సోవియట్ యూనియన్‌లో ఆరోగ్యసంరక్షణ	0—81
సోవియట్ యూనియన్‌లో అంటువ్యాధులు అదుపులోనికి తెచ్చుట	0—44

పోస్టేజి అదనం ప్రతులకు:

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-4.

విశాలాంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజారు, హైద్రాబాద్.

అమెరికన్ ఫొటోగ్రాఫర్ జేమ్సుబర్క్ మృతి

న్యూఢిల్లీ అక్టోబరు 3

నేపాళో హిమాలయాల ప్రకృతి దృశ్యాలను చిత్రీకరిస్తూ దురదృష్టవశాత్తు కాలుజారి 800 అడుగుల లోతుగల లోయలోపడి అమెరికన్ పత్రిక 'లైఫ్' ఛాయా చిత్రకారుడు జేమ్సుబర్క్ నిన్న ఉదయం మరణించారు ఆయన వయస్సు 49 సంవత్సరాలు.

హిమాలయాల ప్రకృతి దృశ్యాలను చిత్రీకరించడానికి ఆయన కాశ్మీరునుండినేపాళ్ వెళ్లారు.

లేక్‌పూరునుండి పోండిలా ప్రయాణం చేస్తూ లేక్‌పూర్‌నకు 27 మైళ్ళ దూరంలో ఆయన జీప్ దిగి ప్రకృతి దృశ్యాలను ఫొటో తీస్తూ వుండగా, ఈ దుస్సంఘటన జరిగింది.

అయన భౌతిక కాయాన్ని ఈరోజు విమానంలో ఇక్కడకు తీసుకవచ్చి రేపు సమాధి చేస్తారు ఈయన 1961 నుండి ఢిల్లీలో అమెరికన్ 'లైఫ్' వారపత్రికకు ఛాయా చిత్రకారుడుగా పనిచేస్తున్నారు

ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు.

భోపాల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరెస్టు

100 సిమెంటు బస్తాలు హైంకర్యంచేసిన కారణంగా

భోపాల్, అక్టోబరు 3

మోటాటిల్లా ఆనకట్టకు సంబంధించిన 100 సిమెంటు బస్తాలను హరించిన కారణంగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం పోలీసులు ఇక్కడ నిన్న సాయంత్రం ఆనకట్టయొక్క ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను అరెస్టుచేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

వీరి కథనం ప్రకారం, సిమెంటు బస్తాలు ఒక చోటి నుండి ఇంకొక చోటికి పంపిస్తున్న సమయంలో వీటిలో కొంత సిమెంటు బస్తాలు హరించబడినట్లు ఆ సందర్భంలో ఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ని అరెస్టు చేసినట్లు తెలిసింది.

ఇతను తరువాత జెయిలుపై విడుదల చేయబడ్డాడు.

శ్రీకామరాజ్‌కు కొందరు కాశ్మీర్ ఎం. ఎల్. ఏ. ల విజ్ఞప్తి

బక్షి సాహెబ్ విడుదలకు

న్యూఢిల్లీ అక్టోబర్ 3

ఈరోజున, కాంగ్రెస్ ప్రెసిడెంటు శ్రీ కామరాజ్‌ను జమ్ము - కాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యులు కొందరు కలుసుకొని, బక్షి గులాం మహమ్మద్‌ను కాశ్మీర్ ప్రభుత్వం అరెస్టుచేయటం రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని, అతనిని విడుదల చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ ప్రభుత్వాన్ని అడగాలని వీరు విజ్ఞప్తి చేశారు.

కేరళలో ధాన్యవ్యాపారుల రాయబారం

అలెప్పి అక్టోబరు 3

ఆంధ్ర మద్రాసురాష్ట్రప్రభుత్వాలువిధిస్తున్న ఆంక్షలఫలితంగా ఆ రాష్ట్రాలలోని బియ్యాన్ని కొనుగోలు చేసి కేరళకు తరలించడం వీలుపడటం లేదని స్థానిక ఆహార ధాన్యాల వ్యాపారులు నిన్న కేరళ గవర్నర్ సలహాదారు శ్రీ ఆర్. ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు.

దక్షిణ మండలంలోని ఆంధ్ర మద్రాసు రాష్ట్రాలనుండి ఎట్టి ఆటంకం లేకుండా బియ్యం తరలించే ఏర్పాట్లను చేయవలసిందిగా వ్యాపారుల ప్రతినిధివర్గం శ్రీ ప్రసాద్‌ను కోరారు.

రాష్ట్రంలో కూడా వివిధ జిల్లాలమధ్య బియ్యం సరఫరాపై ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను గురించి ప్రస్తావిస్తూ ఈ ఆంక్షల వల్ల తరుగుప్రాంతాలకు బియ్యాన్ని తరలించటంలో చిక్కు లేర్పడుతున్నాయని వారు తెల్పారు.

బోనసుకై రేణిగుంట కాటన్ మిల్లు కార్మికుల ఆందోళన

రేణిగుంట, అక్టోబరు 2

చిత్తూరుజిల్లా రేణిగుంట కాటన్ మిల్సు యెంప్లాయీస్ యూనియన్ తరఫున గత వారంలో మిల్లుకు సమీపంగా వుండే *గాజుల మండ్యం*, కాతయ్య కాల్వ కొత్త కాల్వ యెంలమంద్యం గ్రామాలలో ఇటీవల బహిరంగ సభలు జరిగినవి. యూనియన్ అధ్యక్షులు శ్రీ ఎ. ఈశ్వర రెడ్డి కార్యదర్శి శ్రీ జి సుబ్బారెడ్డి, జిల్లా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ జి శివయ్య, శ్రీ కె కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట కాటన్ మిల్లులో గత రెండు సంవత్సరములుగా బోనస్ యివ్వక, కార్మికులకు యిబ్బంది కల్గించడం, చాలా విచారకరమనీ. రాబోవు దీపావళికి 1962-63 1963-64 సంవత్సరాల బోనసును తప్పక యివ్వవలెనని మేనేజిమెంటును కోరారు.

మిల్లునుండి మేనేజిమెంటు తొలగించిన 350 మంది కార్మికులకు గ్రామీణ ప్రజలు సహాయం చేయవలెనని కోరారు.

కార్మికులు జరుపు న్యాయమైన ఆందోళనకు ప్రజలు చేయూత యివ్వవలెనని విజ్ఞప్తిచేశారు.

ఈ బహిరంగసభకు రైతులు విరివిగా హాజరై, కార్మికులయెడల తమ సానుభూతిని వ్యక్తం చేశారు. (వి.వి)

యల్. ఐ. సి. కార్యాలయాల్లో కంప్యూటర్ల ఏర్పాటుకు నిరసన

పార్లమెంటుసభ్యుల రాయబారం, యల్. ఐ. సి. ఉద్యోగుల నిరసనప్రదర్శన

న్యూఢిల్లీ, అక్టోబరు 3

7 గురు పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధివర్గం నేడు కేంద్ర ఆర్థికశాఖామంత్రి శ్రీ టి టి కృష్ణమాచారిని కల్సుకొని జీవిత భీమా కార్పొరేషన్ కార్యాలయాలలో కంప్యూటర్లను ప్రవేశ పెట్టినందువల్ల ఏర్పడే విపరీత పరిస్థితులను వివరించి తమ ఆందోళనను వ్యక్తం చేశారు

ఈ ప్రతినిధి వరంలో శ్రీయుతులు యస్. సి. చటర్జీ పీటర్ అల్వారిస్, యస్ యమ్. బెనర్జీ హోమీ దాజీ, ప్రభాత్ కార్, శ్రీ కంత నాయర్ శ్రీమతి రేణూచక్రవర్తిలు ఉన్నారు.

ఈ పథకాన్ని అమలుపరచటం ప్రస్తుతానికి వాయిదా వేయమని కార్పొరేషన్ అధికారులకు తాను తెలిపినట్లు శ్రీ టి. టి కె ప్రతినిధివరానికి చెప్పారని అఖిలభారత జీవిత భీమా కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం ప్రకటన చేసింది. కంప్యూటర్లను ప్రవేశపెట్టినప్పటికి కార్పొరేషన్ ఉద్యోగులను తగించటం జరగదని శ్రీ టి టి కృష్ణమాచారి ప్రతినిధివర్గానికి హామీ ఇచ్చినట్లు ప్రకటన తెలియ చేసింది.

ఇంతకు ముందు కార్పొరేషన్ కార్యాలయాల్లో కంప్యూటర్ల ఏర్పాటుకు నిరసనగా పార్లమెంటు భవనం ఎదుట యల్ ఐ. సి. ఉద్యోగులు ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు ముందు ప్రదర్శకులు ఢిల్లీ వీధులలో గుండా ఊరేగింపు జరిపారు.

నాల్గవ ప్రణాళికలో ఐదు యంత్రపరికరాల కర్మాగారాలు

నెలకొల్పబడుతాయని హెచ్. యం. టి. నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 3

హిందుస్తాన్ యంత్ర పరికరాలసంస్థ నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలంలో కొత్తగా ఐదు యంత్రపరికరాల కర్మాగారాల్ని సంవత్సరానికి ఒకటి చొప్పున నెలకొల్పటానికి తలపెట్టినట్లు నేడు లోక్‌సభలో భారీ యంత్ర పరిశ్రమలమంత్రి శ్రీ టి. యన్ సింగ్ సమర్పించిన హిందుస్తాన్ యంత్రపరికరాల సంస్థ సాంవత్సరిక నివేదికలో వెల్లడించబడింది.

ఈ ఫ్యాక్టరీ ఒక్కొక్కదానిలో సంవత్సరానికి ఒక వెయ్యి యంత్రాలు తయారు కాగలవు. వీటి విలువ ఐదుకోట్ల రూపాయలు వుంటుందని నివేదికలో తెల్పబడింది.

మూడవ పంచవర్ష ప్రణాళికా పూర్తిఅయ్యే నరికి, ఈ సంస్థ నెలకొల్పిన యంత్ర పరికరాల ఫ్యాక్టరీలు అయిదు వుండగలవు.

ప్రస్తుతం హిందుస్తాన్ యంత్ర పరికరాల సంస్థక్రింద బెంగుళూరులో ఒక గడియారాల ఫ్యాక్టరీ పంజాబ్‌లో పింజోర్ వద్ద ఒక ఫ్యాక్టరీ పనిని క్రితమే ప్రారంభించాయి

హైద్రాబాద్ సనత్‌నగర్‌లో ఒకటి కేరళలో ఎర్నాకులానికి పదిమైళ్ళ దూరంలోగల కలమేసరి గ్రామంవద్ద ఒక ఫ్యాక్టరీ పనిని ప్రారంభించాయి

నాల్గవ ప్రణాళికా వ్యయంపై ప్లానింగ్ కమిషన్ చర్చలు

న్యూఢిల్లీ అక్టోబరు 3

నాల్గవ ప్రణాళిక విషయమై ప్లానింగ్ కమిషన్ నేడుకూడా 3 గంటలపాటు చర్చలు జరిపింది. నేటి సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీ టి. టి కృష్ణమాచారి వ్యవసాయ ఆహారశాఖమంత్రి శ్రీ సి సుబ్రహ్మణ్యం, శ్రీ టి. యన్ సింగ్‌లు పాల్గొన్నారు.

నిన్న జరిగిన సమావేశంలో శ్రీ టి. టి. కె తోబాటు శ్రీ జి. యల్. నందా కూడా పాల్గొన్నారు.

చతుర్థ పంచవర్ష ప్రణాళిక వ్యయం విషయంలో మూడుప్రతిపాదనలు చేయబడ్డాయి మూడు అంతనాలలోను 24,000 కోట్ల రూపాయల వ్యయం చేయాలన్నదే పెద్ద మొత్తం ఈరోజు సమావేశంలో ప్రణాళిక వ్యయం 21,000 కోట్ల రూపాయలనుండి 22 500 కోట్ల రూపాయల వరకు ఉండాలనే ప్రతిపాదనపై చర్చలు కేంద్రీకరించబడ్డాయి ప్లానింగ్‌కమిషన్ ప్రణాళికావ్యయం విషయమై ఇంతవరకు ఎట్టి నిర్ణయానికి రాలేదు. వచ్చే వారంలో మరల ప్లానింగ్ కమిషన్ చర్చలు సాగిస్తుంది. వచ్చే వారాంతానికి ప్లానింగ్ కమీషన్ తుది నిర్ణయం చేయగలదని, ప్రధాని కైరో నుండి తిరిగిరాగానే. మంత్రిమండలి ముందు తమ నిర్ణయాన్ని ప్లానింగ్ కమీషన్ పెట్టగలదని తెలుస్తున్నది.

శ్రీనగర్‌లో విషేధాజ్ఞల పొడిగింపు

శ్రీనగర్, అక్టోబరు 3

శ్రీనగర్‌లో కొన్ని ప్రాంతాలలో 5 గురికన్నా ఎక్కువమంది గుమికూడటాన్ని ఊరేగింపులు జరపటాన్ని నిషేధిస్తూ సెప్టెంబరు 5 న జారీచేసిన ఉత్తర్వును మరో మాసంరోజులు పొడిగిస్తూ శ్రీనగర్ జిల్లా మేజిస్ట్రేటు నేడిక్కడ ఉత్తర్వులు జారీచేశారు

మలేసియా, థాయిలాండ్ ప్రభుత్వాలు తమ రెండుదేశాలమధ్యగల సరిహద్దుల్లోని కమ్యూనిస్టు గెరిల్లాలను అణచివేయాలని ఒప్పందం చేసుకొన్నట్లు వార్త.

హట్టిగనుల బంగారం ధర నిర్ణయం

బెంగుళూరు, అక్టోబరు 2

పారిశ్రామిక ప్రయోజనాలకు వినియోగించే పర్మిటుదారులకు అక్టోబరు ఒకటవతేదీనుండి ఈ సంవత్సరం డిసెంబరు 31 వ తేదీ వరకు హెచ్చు వన్నెగల బంగారాన్ని పదిగ్రాములు 120 రూపాయల చొప్పున విక్రయి తగలమని అమ్మకంపన్ను అదనంగా వుంటుందని, హట్టి బంగారు గనుల సంస్థ నిన్న ఇక్కడ ప్రకటించింది.

రాయచూరు జిల్లాలోని హట్టి బంగారు గనులలో ఉత్తమశ్రేణికి చెందిన బంగారాన్ని ఇటీవల జరిపిన త్రవ్వకాలలో కనుగొన్నారని మైసూరు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ మల్లప్ప పత్రికలవారితో చెప్పారు.

హట్టి గనులలో బంగారం పుష్కలంగా లభించగల అవకాశం వుందని గనులను అభివృద్ధి చేసే కార్యక్రమం కూడ పూర్తయిందని వీరు తెలియ జేశారు.

రాజస్థాన్‌లో మైనారిటీ ప్రజల భాషలకు ప్రాధాన్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి వెల్లడి

జయపూర్, అక్టోబరు 2

ఇంగ్లీషు, హిందీ భాషలలో వలె, ఉర్దూ భాషలో కూడా ముఖ్యమైన న్యాయచట్టాలను నిబంధనలను ప్రచురించడానికి రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీమోహన్‌లాల్ సుఖాడియా నేడిక్కడ అఖిల భారత ఉర్దూమహాసభను ప్రారంభిస్తూ అన్నారు.

మైనారిటీ భాషలలో పంపే దరఖాస్తులకు సమాధానం, మైనారిటీ ప్రజలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు హిందీ, ఆంగ్లభాషలలోనే గాక ఆ యా భాషలలోనే జరపటానికి ప్రభుత్వం నిశ్చయించిందని ఆయన అన్నారు.

మైనారిటీ ప్రజల భాషల విషయంలో ప్రభుత్వం చేసిన నిర్ణయాలు సక్రమంగా అమలు జరుపబడుతున్నాయో లేదో పరిశీలించటానికి ఒక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించనున్నదని ఆయన చెప్పారు.

ఈ సభకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు ఈసభకు హాజరైన వారిలో పండిట్ కుంజ్రూ పండిట్ సుందర్ లాల్ డాక్టరు సయ్యద్ మహమ్మూద్‌లు కూడా ఉన్నారు

కైరోకు నేపాలురాజు పయనం

న్యూఢిల్లీ, అక్టోబరు 4

అలీనదేశాల మహాసభలోపాలొనే నిమిత్తం నేడు ఉదయం నేపాళ్‌రాజు శ్రీ మహేంద్ర, రాణి రత్నతో కైరోకు విమానంలో బయలు దేరారు.

మధ్యప్రదేశ్ పోలీసు కమిషన్ ఛైర్మన్‌గా త్రివేది

న్యూఢిల్లీ అక్టోబరు 3

ప్రణాళికా సంఘ మాజీ ఉపాధ్యక్షులు శ్రీ వి యం. త్రివేదిని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నెలకొల్పబోయే పోలీస్ కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు.

శ్రీ త్రివేది సెప్టెంబరు నెల ఆఖరున ప్రభుత్వోద్యోగం నుండి రిటైరైనారు ప్రధాని శాస్త్రి కోరికమేరకు ఈ పదవిని నిర్వహించడానికి ఆయన అంగీకరించినట్లు తెలుస్తుంది

ఈ నెల 8వ తేదీన శ్రీ త్రివేది గుజరాత్‌లోని తన స్వగ్రామానికి వెళతారు. నవంబరు మొదటివారంలో భోపాల్‌లో ఆయన తన నూతన పదవీ బాధ్యతలను స్వీకరిస్తారు.

స్పెయిన్‌లో విమాన ప్రమాదం కారణంగా 80 మంది మరణించినట్లు అక్టోబరు 3 న ఒక ప్రకటన వెలువడింది.

కాశ్మీర్‌లో బాంబు ప్రేలుళ్ళు

పాక్ ద్రోహులపని కావచ్చుని లోక్‌సభలో వెల్లడి

న్యూఢిల్లీ అక్టోబరు 3

భారతదేశంలో ఉన్న పాకిస్తాన్ గూఢచారులు, ఏజంట్లు కాశ్మీర్‌లో బాంబుప్రేలుళ్ళకు కారకులని భావిస్తున్నామని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి శ్రీ జె. యల్. హాథీ నేడు లోక్‌సభలో అన్నారు.

బారాముల్లాలో సెప్టెంబరు 28 న జరిగిన ప్రేలుళ్ళపై శ్రీ మణిరామ్ తెచ్చిన కాల్ అటెన్షన్ తీర్మానానికి సమాధానమిచ్చిన తరువాత శ్రీ హెంబారువా అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ జె. యల్. హాథీ పైవిధంగా చెప్పారు.

బారముల్లా తహశీల్ కార్యాలయానికి వెలుపల ఒక బాంబు ప్రేలుడు జరిగిందని, రెండవది బారముల్లా జిల్లాలో జి అం వ డి వంతెనవద్ద జరిగిందని ప్రేలుళ్ల వివరాలను చెబుతూ శ్రీ హాథీ వెల్లడించారు

రెండవప్రేలుడు మూలంగా వంతెన కొంతమేరకు దెబ్బతిన్నదని ఆయన చెప్పారు

ఈ ప్రేలుళ్ళు యుద్ధవిరమణరేఖకు 18 మైళ్ళ లోపునే జరిగాయని ఈ సంఘటనలపై పోలీసులు కుక్కల సహాయంతో దర్యాప్తు సాగిస్తున్నారని, ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలలో పాకిస్తాన్ ఏజంట్లు ప్రవేశించినట్లు తనకు సమాచారం అందలేదని మరో అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ హాథీ తెల్పారు

నెల్లూరులోని పెద్ద హోటళ్ళవారు సెప్టెంబరు 25 నుండి కాఫీ రేటును 20 నయాపైసలకు పెంచారు. ఈ రేటు అన్యాయమనీ, కాఫీ, తదితర పదార్థాలను స్వీకరించరాదని కాఫీ వినియోగదారుల సంఘం ఒకకరపత్రాన్ని ప్రచురించింది





సంపాదకవర్గం: కొల్లగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కొల్లగడ్డ రాజగోపాలరావు స్వతంత్ర అచ్చు ప్రింటర్స్, విజయవాడ-4.